


రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు ప్రభుత్వ పథకాలకు సంబంధించి నాలుగు రోజుల క్రితం మొదలైన గ్రామసభల పర్వం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో 589 గ్రామ పంచాయతీలతోపాటు మునిసిపల్ వార్డుల్లో గ్రామసభలు అధికార యంత్రాంగం విజయవంతంగా నిర్వహించింది. కొన్నిచోట్ల మొదట్లో పేరు లేని లబ్ధిదారులు నిరసనలు, ఆందోళనలు సాగించినా... తిరిగి దరఖాస్తులు తీసుకోవడంతో సమస్య పరిష్కారమైంది. ఆందోళనకారులు తమ ఆవేదన పక్కన పెట్టి దరఖాస్తు చేయడంతో గ్రామసభలు సాఫీగా సాగాయి.

# వెల్లువెత్తిన దరఖాస్తులు



సత్తుపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న దృశ్యం (ఫైల్)

| జిల్లావ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులు | |
|---|---|
| ఇందిరమ్మ ఇళ్లకు | 51,712 |
| రేషన్‌కార్డులకు | 50,914 |
| రైతుభరోసాకు | 5,532 |
| ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు | 36,994 |
| ఖమ్మం కార్పొరేషన్‌లో | |
| మొత్తం దరఖాస్తులు | 24,479 |
| ఇందిరమ్మ ఇళ్లు | 7,191 |
| రేషన్‌కార్డులకు | 7,401 |

- నాలుగు రోజుల గ్రామసభల్లో .. కొత్తగా వచ్చినవి 1,45,152
- లబ్ధిదారుల జాబితాకు కసరత్తు
- 26న కొందరికి పంపిణీ

ఖమ్మం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రైతు భరోసా విషయంలో రియల్ ఎస్టేట్ భూములు, ప్లాట్లకు ప్రభుత్వ భూములకు, భవనాలకు రైతుబంధు పొందినట్టు సర్వేలో తేలింది. అయినా కొన్ని మండలాల్లో సుమారు 5,060 మంది రైతులనుంచి 6,359 ఎకరాలలో భూమి లేకపోయినా రైతుబంధు పొందుతున్నట్టు నిర్ధారించారు. గ్రామసభల్లో జిల్లా వ్యాప్తంగా 589 గ్రామసభల్లో 1,45,152 దరఖాస్తులు వచ్చాయి. ఇందిరమ్మ ఇళ్లు కావాలని 51,712, రేషన్‌కార్డుల కోసం 50,914 మంది, రైతుభరోసా కోసం 5,532, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 36,994 దరఖాస్తులు వచ్చాయి. 26న కొంతమంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించనున్నారు.

శుక్రవారం 20 చోట్ల గ్రామసభలు నిర్వహించగా 7,223 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఇందిరమ్మ ఇళ్లకు 3,178, రేషన్‌కార్డులకు 2,402, రైతు భరోసాకు 133, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా 1510 దరఖాస్తులు వచ్చాయి. ఖమ్మం కార్పొరేషన్‌లో మొత్తం దరఖాస్తులు 24,479 రాగా, ఇందులో ఇందిరమ్మ ఇళ్లకు 7,191, రేషన్‌కార్డులకు 7,401 దరఖాస్తులు అందాయి. మొత్తం దరఖాస్తులను మళ్లీ సర్వే నిర్వహించి అర్హులను ఎంపిక చేయనున్నారు గ్రామసభలు పూర్తికావడంతో లబ్ధిదారులు పథకాల మంజూరుకోసం కొండంత ఆశతో ఎదురు చూస్తున్నారు. గతంలో ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు కొన్నిచోట్ల తమపేర్లు లేవని లబ్ధిదారులు గొడవ చేసిన విషయం విదితమే.



ఏదులాపురం గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీవో రాజారావు

అధికారులు చేసిన సర్వేల అనంతరం గ్రామసభల్లో జాబితాలను బహిరంగంగా చదివారు. రైతుభరోసాకు సంబంధించి జిల్లాలో గతంకంటే కొందరు రైతుల సంఖ్య తగ్గబోతుంది. గతంలో 3,42,803 మంది రైతుభరోసా 7.40లక్షల ఎకరాలకు పొందగా ందులో అర్హుల జాబితా పక్కాగా తేల్చారు. అదేవిధంగా ఇందిరకమ్మ ఇండ్లు, ఆత్మీయభరోసా, తెల్లరేషన్ కార్డులకు సంబంధించి గత దరఖాస్తులన్నింటిని సర్వే పూర్తిచేయడంతో దరఖాస్తుదారులంతా మంజూరు కోసం ఎదురు చూస్తున్నారు.

## ఒకటి నుంచి భద్రాద్రిలో
# వాగ్గేయకార ఉత్సవాలు



నవరత్న కీర్తనలు (ఫైల్)

భద్రాచలం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం, శ్రీచక్రా సిమెంట్స్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో భద్రాచల రామదాసు 392వ జయంతిని పురస్కరించుకొని వాగ్గేయకార ఉత్సవాలను ఫిబ్రవరి ఒకటినుంచి నిర్వహించనున్నారు. చిత్రకూట మండపంవేదికగా నిర్వహించే ఈ ఉత్సవాలు ఐదు రోజుల పాటు సాగనున్నాయి. తొలి రోజున భద్రాచల రామదాసు నవరత్న కీర్తనల గోష్టిగానం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రసిద్ధ సంగీత విద్వాంసులు మల్లాది సూరిబాబు, మల్లాది బ్రదర్స్ పాల్గొననున్నారు. అలాగే మంగళంపల్లి బాలమురళీకృష్ణ శిష్యులు ప్రముఖ సంగీత విద్వాంసులు డీవీ మోహన్‌కృష్ణ సైతం పాల్గొననున్నారు.

## నేడు ముగ్గురు
# హైకోర్టు న్యాయమూర్తుల రాక

ఖమ్మం లీగల్ జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నేడు తెలంగాణ హైకోర్టుకు చెందిన ముగ్గురు న్యాయమూర్తులు శనివారం ఖమ్మం రానున్నారు. హైకోర్టు న్యాయమూర్తి, ఖమ్మం పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ పి.శ్రీసుధా, జస్టిస్ భీమపాక నగేష్, జస్టిస్ కాజా శరత్ శనివారం ఉదయం ఖమ్మం జిల్లా కోర్టు ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, అసిస్టెంట్ సెషన్స్ కోర్టుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేయుచున్నారు. ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్ పర్యవేక్షిస్తున్నారు.

# మైనారిటీ గురుకులంలో ప్రియాంక తనిఖీ
## విద్యార్థినులతో కలిసి భోజనం, వసతిగృహం పరిశీలన



విద్యార్థినులతో భోజనం చేస్తున్న ఐఏఎస్ అధికారి ప్రియాంక అల

పాల్వంచ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణ పరిధిలోని మైనారిటీ బాలికల పాఠశాల, కళాశాలలను ఐఏఎస్ అధికారి, రాష్ట్ర పౌరసరఫరాల కార్యదర్శి, మత్స్యశాఖ డైరెక్టర్ ప్రియాంక అల శుక్రవారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా పాఠశాలలో విద్యార్థినులకు అందిస్తున్న మెనూ, హాస్టల్‌లో అందిస్తున్న సౌకర్యాలు, పారిశుధ్యం, ఫ్యాకల్టీలను పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి రాత్రి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అన్ని గురుకుల, బీసీ, ఎస్సీ హాస్టల్స్‌లో స్థితిగతులను పరిశీలించేందుకు సీనియర్ ఐఏఎస్‌లను ప్రభుత్వం నియమించిందని, అందులో భాగంగానే మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలను సందర్శించానని, ఇక్కడ విద్యార్థినులకు అందిస్తున్న సౌకర్యాలు బాగున్నాయని అన్నారు. రాబోయే పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి మంచి ఫలితాలను సాధించాలని విద్యార్థినులకు సూచించారు.

# కిడ్నాప్ చేసి హత్య చేశారు..



- లింగారంతండా వద్ద బయటపడిన మృతదేహం
- మృతుడు.. హైదరాబాద్ పాన్‌మసాలా వ్యాపారి రమేష్‌గా గుర్తింపు
- ఆరు రోజుల తర్వాత వెలుగు చూసిన హత్య ఘటన

కూసుమంచి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరానికి చెందిన పాన్‌మసాలా వ్యాపారి బొల్లు రమేష్ (51) దారుణ హత్యకు గురయ్యాడు. నలుగురు నిందితులు డబ్బులకోసం హైదరాబాద్‌లో కిడ్నాప్ చేసి కారులో తీసుకవచ్చి ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై కూసుమంచి మండలం లింగారంతండా సమీపంలో రహదారిపక్కన మిర్చితోటలో హత్య చేశారు. హత్య ఈనెల 19తేదీ తెల్లవారుజామునే జరిగింది. రహదారి పక్కన దుర్వాసన వస్తుండటంతో గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. హైదరాబాద్ నగరం కార్ఖానా పోలీసులు మృతుడి ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా అక్కడకి చేరుకుని మృతదేహం రమేష్‌దిగా గుర్తించారు.

కార్ఖానా పోలీస్ ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం... హైదరాబాద్ నగరం బండ్లగూడకు చెందిన బొల్లు రమేష్ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో పాన్‌మసాలా వ్యాపారం చేస్తు డిస్ట్రిబ్యూటర్‌గా పనిచేస్తూ సబ్‌డీలర్లకు విక్రయిస్తుంటాడు. ఈ ప్రాంతంలోనే సాజిద్ సబ్‌డీలర్‌గా పనిచేస్తున్నాడు. రమేష్ దగ్గర డబ్బు చాలా ఉందని గుర్తించిన సాజిద్ ఎలాగైన కిడ్నాప్ చేసి డబ్బు గుంజాలని పథకం పన్నాడు. ఇదే ప్రాంతానికి చెందిన మరో ముగ్గురిని తీసుకుని వెళ్లి వాళ్లకు కూడా పెద్దఎత్తున గుట్కాలు కావాలని నమ్మబలికాడు. దీంతో రమేష్ తన గోడౌన్‌కు తీసుకెళ్లాడు.

అనంతరం తమ కారులో రమేష్‌ను ఎక్కించుకుని దారిలో కారులో ప్రయాణిస్తునే రమేష్ కాళ్లు, చేతులు కట్టి వేశారు. డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే చంపుతామని బెదిరించడంతో వెంటనే రూ.15 లక్షలను అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేశాడు. అయితే రమేష్‌ను ఇలాగే వదిలేస్తే తమ గురించి పోలీసులకు సమాచారం ఇస్తాడని భావించి, ఖమ్మం ప్రాంతానికి రాగానే లింగారంతండా సమీపంలో జాతీయ రహదారి పక్కనే మిర్చితోటలోకి తీసుకెళ్లి ఊపిరి ఆడకుండా తాళ్లతో, కండువతో గట్టిగా గొంతునులిమి చంపేశారు. అనంతరం బండరాయితో మోది చనిపోయాడని నిర్ధారించుకుని వెళ్లారు.

### 19 తేదీనే మిస్సింగ్ కేసు నమోదు

రమేష్ 18 తేదీన ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన అతని భార్య జనని కార్ఖానా పోలీసులకు ఫిర్యాదుచేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో అతని ఐఫోన్ సిగ్నల్స్ ఖమ్మంజిల్లా కూసుమంచి ప్రాంతానికి రాగానే నిలిచిపోయాయని గుర్తించారు. అయితే నిందితుల్లో (మిగతా 6వ పేజీలో)

# వరద ముంపు ప్రాంతాలకు రూ.249 కోట్లు

- ఉగాది నాటికి మంచుకొండ ఎత్తిపోతల పథకం పూర్తి
- రూ.8 కోట్లతో స్లాటర్ హౌస్ నిర్మాణం
- ఖమ్మం స్టేడియంలో అథ్లెటిక్స్ ప్రాంగణానికి రూ.5కోట్లు
- నాటి డొంక రోడ్డు.. నేడు 50 అడుగుల రహదారి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నియోజకవర్గ అభివృద్ధిలో రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తున్నామని, సీఎం రేవంత్‌రెడ్డి సాకారంతో ఏడాది కాలంలో రూ.వేలాది కోట్లు మంజూరు చేయించి పనులు పూర్తి చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం నగరానికి రఘునాథపాలెం మండలానికి కలుపుతూ బాలపేట డొంక రహదారి దశాబ్దాలుగా ఉంది. ఇదే డొంకను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 50 అడుగులు వెడల్పుకు ఖమ్మం నగర పాలక సంస్థ పబ్లిక్ హెల్త్ నుంచి రూ.395 కోట్లు మంజూరు చేయించి శుక్రవారం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ లకావత్ సైదులునాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. సెప్టెంబరులో కురిసిన భారీ వర్షానికి ఖమ్మం నగరానికి వరద ముంపు ఏర్పడిందన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి ఇబ్బంది రాకుండా ఆయా ప్రాంతాల్లో కాల్వ వెడల్పు పనుల కోసం ప్రభుత్వం నుంచి రూ.249 కోట్లు మంజూరయ్యాయని, రెండు రోజుల్లో పనులు ప్రారంభించాలని సంబందిత అధికారులను మంత్రి ఆదేశించారు. వర్షాకాలం వచ్చే లోపుగా పనులు పూర్తి కావాలని ఆదేశించారు. బాధితులకు రెండు పడకల ఇళ్లు మంజూరు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సర్ధార్ పటేల్ స్టేడియంలో రూ.5కోట్లతో అథ్లెటిక్ ఆదునిక క్రీడాప్రాంగణం మంజూరైందన్నారు.

ఖమ్మం నియోజకవర్గంలోని పార్కులు మరమ్మతులకు రూ.కోటి నిధులు మంజూరు చేశామన్నారు. వెలుగుమట్ల పార్కుకు రూ.5 కోట్లు పనులు ప్రారంభించటం జరిగిందన్నారు. త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. లకారం చెర్వులో శిల్పారామం ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యాచరణ చేశామన్నారు. మంచుకొండ సాగునీటి ఎత్తిపోతల పథకానికి ఇప్పటికే శంకుస్థాపన పూర్తి చేసుకొని ఉగాది నాటికి ఎత్తిపోతల పథకం పనులు పూర్తి జరిగేలా కార్యాచరణ చేస్తున్నామన్నారు. మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ మంత్రి (మిగతా 6వ పేజీలో)



శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

# ఇది దరఖాస్తుల సర్కారు...

- ప్రజలను మభ్యపెట్టేందుకే గ్రామసభలు
- కాంగ్రెస్ వారికే వత్తాసు పలుకుతున్న కమిటీలు
- బీఆర్ఎస్ నేతలు తాతా మధు, సండ్ర

ఖమ్మం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దరఖాస్తులు తీసుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమిలేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తదితరులు ఆరోపించారు. బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏడాది కాలంగా ప్రజలకు ఆశ చూపుతూ దరఖాస్తులు తీసుకోవడం ఆ తర్వాత పెండింగ్‌లో ఉంచడం పరిపాటిగా మారిందని, ప్రజలు కాంగ్రెస్ పాలనపై ఆగ్రహంతో ఉన్నారని వారు ఆరోపించారు.

ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ ప్రజాపాలన పేరుతో దరఖాస్తులు తీసుకుని ఏడాదిగా అమలు చేయలేదని ఇప్పుడు మళ్లీ దరఖాస్తులు తీసుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నందున ప్రజలను మభ్యపెట్టేందుకు దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందని ఎన్నికల మేనిఫేస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. అందువల్లనే గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా నిరసన వ్యక్తం చేస్తున్నారని, ఆందోళనలు సాగిస్తున్నారన్నారు. ఇందిరమ్మ కమిటీలు కాంగ్రెస్ వారికే సంక్షేమ పథకాలు అందించేలా సిఫార్సులు చేస్తున్నాయన్నారు. లబ్ధిదారుల జాబితాలను చదివేందుకు అధికారులు భయపడుతున్నారని నిరుపేదలకు ఎక్కడా అందడం లేదని ఇందిరమ్మ కమిటీల్లో ఉన్నవారే కాంగ్రెస్ వారిని ప్రశ్నిస్తున్నారన్నారు. సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పాలన పట్ల ఏడాదికే వ్యతిరేకత వచ్చిందని ఎన్నికల్లో హామీలు ఇచ్చి ఇప్పుడు ఏదీ సక్రమంగా అమలు చేయడం లేదని ఆరోపించారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీకెందుకు ఓటేశామని బాధపడుతున్నారని తెలిపారు. గ్రామసభలకు మంత్రులు ఎమ్మెల్యేలు వెళ్లలేదని ప్రజల నుంచి నిరసన వస్తుందని గమనించి వెళ్లలేదన్నారు. పోలీసుల పహరాతో గ్రామసభలు నిర్వహించడం సిగ్గుచేటన్నారు. ఆరు హామీలు అరడజను సార్లు దరఖాస్తులు తీసుకోవడం తప్ప చేసేదేమిలేదన్నారు. విలేకరుల సమావేశంలో డీసీసీబీ మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, ఆర్‌జేసీ కృష్ణ, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మధు, సండ్ర తదితరులు



మౌనిక మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

## నిదానపురంలో
# విషాదం

- మౌనికను, ఆమె పిల్లలను చూసి కన్నీటిపర్యంతమైన గ్రామస్థులు
- చోరీ కేసులో రిమాండ్ ఖైదీగా జైలులో వున్న భర్త
- మృతదేహాలను చూసేందుకు హైదరాబాద్ నుంచి వచ్చిన మౌనిక తల్లిదండ్రులు
- తమ కూతురులా ఎవరూ బలికావొద్దని రోదన
- భర్త లేకుండానే రాత్రి అంత్యక్రియలు పూర్తి

మధిరరూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తన భర్త చోరీలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కాడని తెలిసి ఇద్దరు పిల్లలను చంపి, ఆత్మహత్యకు పాల్పడిన తల్లి ఉదంతం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఖమ్మం జిల్లా మధిర మండలం నిదానపురం గ్రామంలో గురువారం ప్రేజ(మౌనిక) అనే మహిళ. తన ఇద్దరు కుమార్తెలకు ఉరి వేసి తానూ ఉరివేసుకొని ప్రాణం తీసుకున్న విషయం విదితమే. ఖమ్మం (మిగతా 6వ పేజీలో)



# రైతులకు నష్టం జరగనివ్వం

- మంత్రి తుమ్మల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం..
- టీజీ ఆయిల్‌ఫెడ్ ఎం.డి. యాస్మిన్‌బాషా
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



వివరాలు : 6లో

# ఇదే తొలిసారి...

- జిల్లా పర్యాటక ప్రాంత అందాల వీక్షణకు మూడు ప్యాకేజీలు
- ఇప్పటికే ఒక ప్యాకేజీ అమలు
- తాజాగా మరో రెండు ఖరారు

# ఇదే తొలిసారి...

- జిల్లా పర్యాటక అందాల వీక్షణకు మూడు ప్యాకేజీలు
- ఇప్పటికే ఒకటి అమలు
- తాజాగా మరో రెండు ఖరారు
- ప్రతి పర్యాటకుడికి ఆధార్ కార్డు తప్పనిసరి

భద్రాచలం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏజెన్సీ పర్యాటక రంగాన్ని తిలకించేందుకు పర్యాటకులు అధికసంఖ్యలో వస్తున్న క్రమంలో వారిని ఆకర్షించేందుకు జిల్లా అధికార యంత్రాంగం పర్యాటక అందాల వీక్షణకు ప్రత్యేక ప్యాకేజీలను రూపొందించింది. ఇటీవల జిల్లా కలెక్టర్ జితేష్‌వి పాటిల్, ఏరుది రివర్ ఫెస్టివల్ పేరుతో జిల్లాలోని ఏజెన్సీ పర్యాటక అందాలను, ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలను, ఆదివాసీ వంటకాలు, రుచులను, విలువిద్య, ఆదివాసీ నృత్యాలు, ట్రెక్కింగ్‌లతో మూడురోజుల ప్యాకేజీని అమలు చేశారు. ఈ సమయంలో వచ్చిన సలహాలను పరిగణలోకి తీసుకొని జిల్లాలోని ఏజెన్సీ పర్యాటక రంగాన్ని మూడు ప్యాకేజీలుగా రూపొందించారు. ప్రతీ ప్యాకేజీకి ఒక ప్రత్యేక ధరను ఖరారు చేశారు. కాగా పర్యాటక ప్రాంతాలను తిలకించేందుకు వచ్చే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డును తెచ్చుకోవాల్సి ఉంటుంది.

**గిరిజన గ్రామం బొజ్జిగుప్ప ప్యాకేజీ ఇదే..**

దుమ్ముగూడెం మండలంలోని బొజ్జిగుప్పలో పర్యాటకుల కోసం ఒక రోజు ప్యాకేజీని రూపొందించారు. పెద్దలకు రూ.1000,



పిల్లలకు రూ.600, మాంసాహారం కోరుకునే వారు రూ.100 అదనంగా చెల్లించాలి. ఈ ప్యాకేజీ తీసుకున్న వారికి ఒక రోజు గిరిజన గృహాల్లో బస చేసే అవకాశం, క్షేత్రస్థాయి పర్యటన, సంప్రదాయ విలువిద్యను వీక్షించడంతోపాటు ఆసక్తి గల వారు ప్రదర్శించేందుకు అవకాశం ఉంటుంది. ఆదివాసీల నృత్యం, క్యాంపు ఫైర్ ఈ ప్యాకేజీలో అందుబాటులో ఉన్నాయి. కాగా బొజ్జిగుప్ప గ్రామానికి వెళ్లేందుకు రవాణా చార్జీలు అదనం. ఈ ప్యాకేజీ కోరుకునే వారు 7331179970లో సంప్రదించాలని కోరారు.

**కనకగిరి గుట్టల ట్రెక్కింగ్ ప్యాకేజీ ఇదే...**

చంద్రుగొండ మండలంలోని బెండాలపాడు గ్రామంలో ఉన్న కనకగిరి గుట్టలపై ట్రెక్కింగ్ నిర్వ

> పర్యాటక అందాలకు నెలవైన భద్రాద్రి జిల్లాలో ఆ అందాలను వీక్షించేందుకు అధికార యంత్రాంగం ప్యాకేజీని రూపొందించడం ఇదే తొలిసారి. ఉమ్మడి ఖమ్మం జిల్లా... ఎన్నో సుందర రమణీయ దృశ్యాలకు నెలవైనా.. ఈ ప్రాంతంలో ఎప్పుడూ ప్యాకేజీలు రూపొందించలేదు. కానీ ఈసారి జిల్లా అధికార యంత్రాంగం చేపట్టిన ఈ ప్రయత్నం పర్యాటకులను సైతం విశేషంగా ఆకట్టుకుంటోంది. భద్రాద్రి రామయ్య దర్శనంతోపాటు నదీ తీరంలో బస చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు, గిరిజన మ్యూజియానికి సరికొత్త మెరుగులు, ఆదివాసీ నృత్యాలు, సంస్కృతి, సంప్రదాయాలను ఆకళింపు చేసుకునేందుకు ప్రత్యేక చర్యలు ట్రెక్కింగ్ లాంటి వాటిని ప్రవేశపెట్టడం పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఈ క్రమంలో పర్యాటకుల సమయం, ఆర్థిక స్థోమతను పరిగణలోకి తీసుకొని ప్యాకేజీలను రూపొందించినట్టు తెలుస్తోంది.



హించేందుకు పర్యాటకులకు అధికార యంత్రాంగం అవకాశం కల్పించింది. ఇందుకోసం ప్రత్యేకప్యాకేజీని రూపొందించింది. ఈ ప్యాకేజీలో ప్రతి వ్యక్తి రూ.2వేలు చెల్లించాలి. మాంసాహారం కోసం రూ.100 అదనంగా చెల్లించాలి. సంప్రదాయ విలువిద్య తిలకించడం, ప్రదర్శించే అవకాశం, ఆదివాసీ నృత్యాలు, క్యాంపు ఫైర్, రాత్రి బస చేసేందుకు అవకాశం ఈ ప్యాకేజీలో కల్పించబడ్డాయి. రవాణా చార్జీలు అదనం. వివరాలకు 8978604836లో సంప్రదించాలని కోరారు.

**రివర్‌సైడ్ క్యాంపు ప్యాకేజీ...**

భద్రాచలంలో ఇప్పటికే రివర్‌సైడ్ క్యాంపు ప్యాకేజీ అందుబాటులో ఉంది. భద్రాచలం గోదావరి కరకట్ట వద్ద పర్యాటక ప్యాకేజీ ఒక రోజు విడిది సౌకర్యం కోసం రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. ఐదేళ్లలోపు పిల్లలకు రూ.300చెల్లించాలి. క్యాంపునకు వచ్చిన అనంతరం టీ, రాత్రి భోజనం, రాత్రి బస చేసినందుకు ఉదయం అల్పాహారం టీ ప్యాకేజీ కలిపి రూ.750గా నిర్ణయించారు. ఈ ప్యాకేజీ వివరాల కోసం 7995806182లో సంప్రదించాలి.

# ప్రభుత్వ పరిపాలనలో ఉద్యోగుల పనితీరు కీలకం

- ఉద్యోగులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం
- టీజీవోస్ డైరీ ఆవిష్కరణలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



డైరీ ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనలో అధికారుల నుంచి గ్రామస్థాయిలో పనిచేసే ఉద్యోగుల పనితీరు కీలకంగా ఉంటుందని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉద్యోగులకు ఎప్పుడు స్వేచ్ఛ, న్యాయం జరుగుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి సంక్షేమ పథకాలను అర్హత కలిగిన లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. టీజీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, వేల్పుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం సంఘం నాయకులు మంత్రి తుమ్మలను క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర డైరీని మంత్రి తుమ్మల ఆవిష్కరించారు. అసోసియేట్ అధ్యక్షుడు వాసిరెడ్డి శ్రీనివాస్, కోశాధికారి శేషప్రసాద్, టీజీవోస్ హౌజింగ్ సొసైటీ అధ్యక్షుడు కిషోర్, కార్యదర్శి విజయ్‌కుమార్, కోశాధికారి రమేశ్ పాల్గొన్నారు.

**టీఎన్జీవోస్ నూతన కార్యవర్గానికి అభినందనలు**

ఇటీవల నియామకం జరిగిన టీఎన్జీవోస్ నూతన అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, బుల్లెట్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంఘం నాయకులు మంత్రి తుమ్మలను కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని మంత్రి తుమ్మల అభినందించారు. కోశాధికారి వల్లపు వెంకన్న, నాయకులు తాళ్లూరి శ్రీకాంత్, దుర్గాప్రసాద్, జైపాల్, గంగవరపు బాలకృష్ణ, రమేశ్, శ్రీధర్, ఏలూరి హరికృష్ణ, పెద్దినేని రాధాకృష్ణ, కమ్మా మన్మదరావు, కోటపాటి రుక్మారావు పాల్గొన్నారు.

### ప్రభుత్వ వైద్యసేవల బలోపేతానికి

# 31న 'డీఎంహెచ్‌వో'ల ఎదుట ధర్నా

**పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిరోమణి పిలుపు**



మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిరోమణి

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యసేవల బలోపేతం ద్వారానే నిరుపేదలకు మంచి వైద్యం అందుతుందని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిరోమణి ఆరోపించారు. ప్రభుత్వ వైద్యసేవలు బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31న రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాల ఎదుట పీవోడబ్ల్యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చామని ప్రకటించారు. శుక్రవారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన పీవోడబ్ల్యూ, పీవైఎల్ జిల్లా కమిటీ సమావేశంలో శిరోమణి మాట్లాడారు. నాయకులు ఝాన్సీ, శోభ, చైతన్య, వెంకటేష్, శివ, ప్రమోద్ పాల్గొన్నారు.

# పంచ సూత్రాలు.. గెలుపునకు మార్గాలు

**యూపీఐ డిజిటల్ వినియోగంపై మహిళా టీవోటీలకు శిక్షణలో డీఆర్డీవో విద్యాచందన**

కొత్తగూడెం అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): చేతులు కలిస్తే చప్పట్లు... మనుషులు కలిస్తే ముచ్చట్లు... లక్ష్యాలు కలిస్తే ప్రగతికి మెట్లు.. అని డీఆర్డీవో విద్యాచందన అన్నారు. శుక్రవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో ఫైనాన్షియల్ లిటరసీ పోగ్రాంపై గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), డీఆర్డీఏ, ఎన్జీవొ యుగంధర్ ఆర్గనైజేషన్ సంయుక్తాధ్వర్యంలో యూపీఐ డిజిటల్ వినియోగం, ఆర్థిక స్వావలంబనపై గ్రామీణ మహిళా టీవోటీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానుద్దేశించి డీఆర్డీవో మాట్లాడుతూ.. ప్రధానంగా గ్రామీణ ప్రాంత మహిళలు సమావేశాలు, పొదుపులు, అంతర్గత అప్పులు, తిరిగి చెల్లింపులు, రికార్డుల నిర్వహణ అనే పంచ సూత్రాలను పాటించాలని, తద్వారా ఆర్థికంగా బలోపేతం అవుతారన్నారు. కేంద్రప్రభుత్వం ఆదేశాలతో మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ వారు ఆర్థిక అక్షరాస్యత పెంపునకు భౌగోళికంగా అటవీ ప్రాంతాలు విస్తారంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, జయశంకర్ భూపాలపల్లి, కొమరం భీం అసిఫాబాద్ జిల్లాలను బ్యాంకు లింకేజీ పోగ్రాం పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిందన్నారు. సెర్ప్ ప్రాజెక్ట్ మేనేజర్ వీరమల్లు మాట్లాడుతూ.. గ్రామీణ మహిళలు సైబర్ నేరాలకు



పంచసూత్రాలు వివరిస్తున్న అధికారులు

గురికాకుండా పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. జిల్లాలో ఫిబ్రవరి 15లోపు ప్రతి మండలంలో 5గ్రామాల్లో ప్రయోగాత్మకంగా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటుచేసి మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. శిక్షణలో 45నిమిషాలు పాటు 78మహిళా టీఓటీలకు వైకుంఠపాళి ఆట ద్వారా పొదుపు సూత్రాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్బీఐ లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి, అడిషనల్ డీఆర్డీవో నీలేష్, 22 మండలాల నుంచి 73 ఏపీఎంలు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ప్రథమ స్థానం సాధించిన ఖమ్మం జట్టు

### ఎస్‌జీఎఫ్ అండర్-17

# బాలికల క్రికెట్ విజేత ఖమ్మం

**ద్వితీయ స్థానంలో నిలిచిన రంగారెడ్డి జట్టు**

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అండర్-17 బాలికల క్రికెట్ పోటీలు ముగిశాయి. పోటీల్లో విజేతగా ఖమ్మం జట్టు నిలవగా, రంగారెడ్డి జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మొదటగా బ్యాటింగ్ చేసిన ఖమ్మం జిల్లా జట్టు 89 పరుగులు చేయగా.. అనంతరం ఛేజింగ్‌కు దిగిన రంగారెడ్డి జిల్లా జట్టు 74 పరుగులు మాత్రమే చేసి ఓటమి చెందింది. ఇక మహబూబ్‌నగర్ జిల్లా జట్టు తృతీయ స్థానం కైవసం చేసుకుంది. పోటీల అనంతరం డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల ఎస్‌జీఎఫ్ సెక్రెటరీలు నర్సింహమూర్తి, నరేష్, రాష్ట్ర అబ్జర్వర్ గోపాల్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# వరద ముంపు ప్రాంతాలకు రూ.249 కోట్లు

(5వ పేజీ తరువాయి)



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

తుమ్మల నాగేశ్వరరావు చొరవతో ఏడాదిలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ పదేళ్లకాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలను పట్టించుకోలేదని ఒక్క రేషన్‌కార్డు, ఇళ్ల మంజూరు కాకపోవటంతో ప్రజాపాలన గ్రామసభలో ప్రజల దరఖాస్తుల సంఖ్య పెరిగిందని సమర్థించుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు కావాలనే గ్రామ సభలను రసాబాసా చేశారని, పదేళ్ల కాలంలో ఎన్ని రేషన్‌కార్డులు ఇచ్చారో ప్రకటించాలని డిమాండ్ చేశారు.

మాజీ ఏఎంసీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్ మాట్లాడుతూ ఖమ్మం నగరం నుంచి బాలపేటకు బైపాస్ రోడ్డు వెడల్పు పెంచటం ద్వారా ఖమ్మం నగరానికి ట్రాఫిక్ సమస్య తగ్గుతుందన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలకు మార్గం సుగమం అవుతుందని ఎన్నో గ్రామాలకు త్వరగా చేరుకునేందుకు వీలు ఏర్పడిందన్నారు. కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ ఖమ్మం నగరంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజాపాలన డివిజన్ సభలు, బుడ్డీ యాప్ ద్వారా పౌరసేవలు, రెవెన్యూ మేళా, పార్కులు అభివృద్ధిపై క్షుణంగా వివరించారు.

ఖమ్మం ఏఎంసీ చైర్మన్ యర్రగర్ల హనుమంతరావు, జడ్పీ సీఈవో దీక్షారైనా, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, పాలెపు విజయ వెంకటరమణ, కాంగ్రెస్ నాయకులు మలీదు మనీష్, మాజీ సర్పంచి భూక్య భాషానాయక్, మందడపు భాస్కర్‌రావు, కుర్రా భాస్కర్‌రావు, గొడుగు నాగయ్య, భూక్య రాంచంద్రు, మందడపు రాధాకిషన్‌రావు, బాబు, వరకాల వెంకులు పాల్గొన్నారు.

# కిడ్నాప్ చేసి హత్య చేశారు..

(5వ పేజీ తరువాయి)

అనుమానితుడిగా ఉన్న సాజిద్‌ను పట్టుకుని పోలీసులు తమదైన శైలిలో విచారించగా తనతోపాటు మరోముగ్గురు కలిసి హత్య చేసినట్టు ఒప్పుకున్నట్టు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య జనని, కుమారుడు ఉన్నారు. రమేష్‌ను చంపేసి సుమారు ఆరు రోజులు కావడంతో మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వస్తుండటంతో, మృతదేహం తరలించేందుకు ఇబ్బందిగా ఉండటంతో వైద్యులను ఇక్కడికే తీసుకవచ్చి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబసభ్యుల అభ్యర్థన మేరకు ఖమ్మానికి చెందిన అన్నం శ్రీనివాసరావు ద్వారా ఇక్కడే అంత్యక్రియలు నిర్వహించారు.

# ఆగని ఇసుక అక్రమ రవాణా

**అడ్డగోలుగా తరలింపు**

**నాణ్యత లేని ఇసుకతోనే సీసీ రోడ్లు**

నేలకొండపల్లి, జనవరి24 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి ఆటంకాలు లేకుండా ఇసుక అక్రమ దందా కొనసాగుతూనే ఉంది. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఇసుక రీచ్‌గా పైనంపల్లిని ప్రభుత్వం ప్రకటించక పోయినప్పటికీ, పైనంపల్లి ఏటి నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నప్పటికీ పోలీసులు కానీ, మైనింగ్ అధికారులు కానీ అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవటం పలు అనుమానాలకు తావిస్తున్నది. పైనంపల్లి ఏటినుంచి తరలిస్తున్న నాణ్యత లేని ఇసుకనే సీసీ రోడ్లకు వాడుతున్నారు. సీసీ రోడ్లు పోసే కాంట్రాక్టర్లందరూ దాదాపుగా అధికార పార్టీకి చెందిన వారే కావటంతో, మంత్రి పేరు చెప్పి బెదిరిస్తుండటంతో అధికారులు సైతం రోడ్ల నాణ్యతను పరిశీలించటం లేదనే వ్యాఖ్యలు వినపడుతున్నాయి. ప్రతిరోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లను పెట్టి, జేసీబీతోలోడ్ చేస్తూ రవాణా చేస్తున్నారు. సీసీ రోడ్ల పేరుతో బయటకు కూడా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. మమ్మలెవరూ ఏమీచేయలేరన్న ధీమా ఇసుక అక్రమాసురుల్లో స్పష్టంగా కనపడుతున్నది.

**నాణ్యతను పట్టించుకోని అధికారులు**

నాణ్యత లేని ఇసుకతో సీసీ రోడ్లను పోస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదు.ఒక్కసారే మండలవ్యాప్తంగా సీసీ రోడ్ల పనులను ప్రారంభించటంతో, అన్ని రోడ్లను, నాణ్యతను చూడటం కూడా అధికారులకు సవాల్‌గానే మారింది.

**మంత్రి పొంగులేటి దృష్టికి**

మూడు రోజుల క్రితం మండల పర్యటనకు వచ్చిన మంత్రి పొంగులేటికి బుద్దారంలో లంచ్‌లో కొంతమంది ఇసుక వ్యవహారాన్ని దృష్టికి తీసుకెళ్ళినట్లుగా సమాచారం. ఇసుక వ్యవహారమై మంత్రి అధికారులను ఆరా తీసినట్లు తెలిసింది. ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని సీజ్ చేస్తున్నారని, సీసీ రోడ్లకు ఇసుక ఇబ్బందిగా ఉందని చెప్పారని సమాచారం. అంతే గాకుండా కొంతమంది కాంగ్రెస్ నాయకులు మంత్రికి తప్పుడు సమాచారం ఇచ్చినట్లుగా తెలుస్తున్నది. ఇదే విషయాన్ని మంత్రి పోలీస్ అధికారులను వివరాలను అడుగగా ఇష్టానురీతిన తోలుతున్నారని ఫిర్యాదులొస్తున్న నేపద్యంలోనే ట్రాక్టర్లను పట్టుకుంటున్నామని చెప్పారని తెలుస్తున్నది. దీంతో స్పందించిన మంత్రి పొంగులేటి అక్కడనే ఉన్న ఆర్డీఓకు సీసీ రోడ్లకు సంబంధించి తేదీలతో సహా కూపన్లు జారీ చేయమని చెప్పారు. అయినప్పటికీ ఎటువంటి కూపన్లు లేకుండానే ఇసుకను అక్రమంగా ఇష్టానురీతిన అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఇసుక ను అక్రమంగా తరలిస్తుండటంతో భూ గర్భ జలాలు తగ్గిపోయి, నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. గతంలో ఇలానే పెద్ద ఎత్తున ఇసుకను తరలించినప్పుడు, గ్రామాల్లో నీటి కొరత తీవ్రంగా ఏర్పడింది.

# రైతులకు నష్టం జరగనివ్వం

- మంత్రి తుమ్మల ఆదేశాలమేరకు చర్యలు తీసుకుంటాం
- టీజీ ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్‌బాషా

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



రేగళ్లపాడు నర్సరీలో పామాయిల్ మొక్కలు

సత్తుపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎదుగుదల లేదనే కారణంతో పామాయిల్ మొక్కలను ధ్వంసం చేసిన ఘటనకు సంబంధించి రైతులకు నష్టం జరగకుండా చూస్తామని టీజీ ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్‌బాషా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'ధ్వంసమా.. మాయమా..?' అనే శీర్షికతో ఈనెల 21వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై యాస్మిన్‌బాషా స్పందిస్తూ.. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలకు రైతులెవరికీ నష్టం జరగకుండా చూస్తామని తెలిపారు.

ఈ ఆర్థిక సంవత్సరంలో దిగుమతి చేసుకున్న తెంబా మొక్కలు ప్రమాణాలకు అనుగుణంగా ఎదగడం లేదని గమనించి, టెక్నికల్ కన్సల్టెంట్ సూచనల మేరకు ఫెడ్ కోస్టారికాకు తెలియజేశామన్నారు. ప్రతిస్పందనగా గతేడాది ఆగస్టు 10న రేగళ్లపాడులోని నర్సరీని భారతదేశ పర్యటనలో భాగంగా కోస్టారికా అధికారులు సందర్శించిన అనంతరం జన్యుపరమైన సమస్య కాదని, నిర్వహణ లోపం (శారీరక లోపం) అని నిర్ధారించారన్నారు. ఆ తర్వాత 3నెలల పాటు కోస్టారికా అధికారుల సూచనల ప్రకారం ఎరువులను మొక్కలకు అందించగా ఎక్కువశాతం ఎదుగుదల కనిపించకపోవడం గతేడాది నవంబర్ 29న కోస్టారికా వారికి నివేదిక సమర్పించినట్లు చెప్పారు.

టీజీ ఆయిల్‌ఫెడ్ యాజమాన్యానికి ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే 80,300మొక్కలను జిల్లా అధికారి, నర్సరీ ఇంచార్జీ, హార్టీకల్చర్ అధికారి సమక్షంలో గతనెల 19న లోపం గమనించిన మొక్కలను తొలగించగా అదేనెల 26వ తేదీన హెడ్ ఆఫీస్‌కు మెయిల్ ద్వారా జిల్లా అధికారి సమాచారం ఇచ్చారన్నారు. తమకు సమాచారం ఇవ్వకపోవడంతో షోకాజ్ నోటీసు ఇచ్చామని, ఘటనపై విచారణకు హెడ్ ఆఫీస్ ఇప్పటికే ఒక కమిటీని ఏర్పాటుచేసి నివేదిక సమర్పించాలని నిర్దేశించామని చెప్పారు.

**మంత్రి తుమ్మల ఆదేశాలు**

ధ్వంసమైన మొక్కలపై మంత్రి తుమ్మల విచారణకు ఆదేశించారు. ఈ సీడ్లింగ్స్ దిగుమతికి, వాటిని ఇప్పటివరకు పోషించడానికి అయిన ప్రతిపైసా ఖర్చును సప్లయిర్ కంపనీ నుండి తిరిగి రాబట్టాలని ఆదేశించారు. మొక్కల వ్యవహారంలో ఏవైనా అవకతవకలు జరిగాయని నిర్ధారణ అయితే సంబంధిత అధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయిల్ ఫెడ్ అధికారులకు నిర్దేశించారు. రైతులకు ఆరోగ్యకరమైన, పూర్తిగా ఎదిగిన మొక్కలను మాత్రమే పంపిణీ చేయాలని ఆయిల్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు.

# నిదానపురంలో విషాదం

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం గురువారం అర్ధరాత్రి తర్వాత మృతదేహాలను నిదానపురం తీసుకువచ్చారు. శుక్రవారం ఉదయం గ్రామస్థులు పెద్దసంఖ్యలో వచ్చి తల్లి, ఇద్దరు పిల్లల మృతదేహాలను చూసి కన్నీరు మున్నీరయ్యారు. మౌనిక భర్త బాజీని పోలీసులు గురువారమే రిమాండ్ ఖైదీగా జైలుకు తరలించారు. దీంతో అతడిని బెయిల్‌పై తీసుకువచ్చేందుకు బంధువులు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే రాత్రి వరకు కూడా బాజీకి బెయిల్ రాకపోవడంతో మౌనిక, ఆమె ఇద్దరు పిల్లలకు బంధువులు అంత్యక్రియలు నిర్వహించారు. కుమార్తె మరణవార్తను తెలుసుకొని, ఆమెను కడసారి చూసేందుకు మౌనిక తల్లిదండ్రులు, బంధువులు హైదరాబాద్ నుంచి నిదానపురం వచ్చారు. కుమార్తె శవాన్ని చూసి భోరున విలపించారు. ఆడపిల్లలు ఎవరూ మోసగాళ్ల వలలో పడొద్దని, తల్లిదండ్రులు, పెద్దలు మాటల విని మంచి జీవితాన్ని కొనసాగించాలని వారు ఈ సందర్భంగా తెలిపారు. ఆడపిల్లలెవరూ విలువైన జీవితాన్ని కోల్పోవద్దని సూచించారు. బాజీ మాయమాటలు చెప్పి ట్రాప్‌లోకి దించాడని, జీవితాన్ని పాడుచేశాడని పేర్కొన్నారు. పెళ్లి సమయంలోనే మా అమ్మాయిని వద్దని తీవ్రంగా వారించామని అయినా తమ మాట వినకుండా బాజీని పెళ్లి చేసుకుని జీవితాన్ని నాశనం చేసుకుందని కన్నీళ్ల పర్యంతమయ్యారు. ఈ నెల 16వ తేదీన చివరిగా తమకు ఒకసారి ఫోన్ చేసిందని, 'మీ అమ్మానాన్నలు మీ చెల్లెనే ఎక్కువగా చూసుకుంటూ నిన్ను పట్టించుకోవడం లేదు.. వెళ్లి డబ్బులు తీసుకురా..' అని తనను బాజీ బెదిరిస్తున్నట్లుగా ఫోన్లో తెలిపిందని మృతురాలి మేనత్త పేర్కొంది. దాదాపు రెండు గంటలపాటు గ్రామంలో వున్న తల్లిదండ్రులు, బంధువులు అక్కడినుంచి వెళ్లిపోయారు. పోలీసులు ఎటువంటి ఘర్షణలు జరుగకుండా గ్రామంలో బందోబస్తు ఏర్పాటుచేశారు.

**మాయమాటలకు బలైన మౌనిక..**

మౌనిక ఉన్నత విద్యావంతురాలు. ఎంటెక్ పూర్తి చేసింది. ఈమె తల్లిదండ్రులు ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూ హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో నివాసముంటున్నారు. ఆరేళ్ల క్రితం మౌనికకు గాలివాటంగా మధిర మండలం నిదానపురం గ్రామానికి చెందిన షేక్ బాజీ అనే యువకుడు పరిచయం అయ్యాడు. ఆ తర్వాత బాగా చదువుకుంటానని, ఆస్తిపాస్తులు ఉన్నాయని రకరకాలుగా మాయమాటలు చెప్పి నమ్మించి మౌనికను వలలో వేసుకున్నాడు. ఇద్దరి మతాలు వేరైనప్పటికీ వివాహం చేసుకున్నారు. కన్న తల్లిదండ్రులను కూడా వదిలేసి ఇతడ్ని నమ్మి వచ్చి పెళ్లి చేసుకొని నిదానపురంలో నివాసముంటోంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు మెహక్(5), మెనురూల్(4) ఉన్నారు. గత కొన్నేళ్ల నుంచి ఈమె భర్త బాజీ ఏ పని చేయకుండా జులాయిగా తిరుగుతూ సులువుగా డబ్బు సంపాదించాలనే కోర్కెలతో దొంగతనాలకు అలవాటుపడ్డాడు.

పలు చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. పోలీసులు వచ్చి మీ భర్త దొంగతనం కేసులో ఇరుక్కున్నాడని, అదుపులోకి తీసుకున్నామని తెలపడంతో ఆమె నిర్ఘాంతపోయింది. దీంతో అవమానభారంతో పిల్లలను చంపి తానూ ఆత్మహత్యకు పాల్పడింది.

## ఐఎన్‌టీయూసీ విజయానికి సమష్టిగా కృషి చేయాలి

బూర్గంపాడు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీ కర్మాగారంలో 31న జరగనున్న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ విజయానికి కార్మికులు సమష్టిగా కృషి చేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, రాష్ట్ర అటవీశాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం బూర్గంపాడు మండల పరిదిలోని సారపాకలో ఐఎన్‌టీయూసీ మిత్రపక్షాల ఎన్నికల కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. ఐఎన్‌టీయూసీ నాయకులకు కార్మికుల సమస్యలపై మంచి అవగాహన ఉందని తెలిపారు. అధిక మెజారిటీతో గెలిపించి కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ, ఐఎన్‌టీయూసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## విద్యుత్ శాఖ ఏఏఈ మాతృసంస్థకు సరెండర్

భద్రాచలం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఐటీడీఏ విద్యుత్ శాఖ విభాగంలో పని చేస్తున్న అడిషనల్ అసిస్టెంటు ఇంజనీరు మున్నీర్‌పాషాను మాతృసంస్థ కు సరెండర్ చేస్తున్నట్లు ఐటీడీఏ పీవో బి.రాహుల్ తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్య వైఖరి, చట్టబద్ధమైన విధి విధానాలు పాటించకపోవడం, ఐటీడీఏ కార్యాలయం బాధ్యత గల పనుల్లో నిర్లక్ష్య వైఖరి కనబరచడంతో తనను మాతృ శాఖ అయిన ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయంకు సరెండర్ చేస్తున్నట్లు పీవో తెలిపారు. ఇదిలా ఉండగా విధి నిర్వహణలో తానెప్పుడు నిర్ల క్ష్యం వహించలేదని ఏఏఈ మున్నీర్‌పాషా ఆంధ్రజ్యోతికి స్పష్టం చేశారు. తాను విధుల పట్ల నిర్లక్ష్యం వహించినట్లు కనీస ఆధారాలు సైతం లేవని పేర్కొన్నారు.

**పేకాట స్థావరాలపై పోలీసుల దాడి**

ములకలపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ములకలపల్లి మండలం చాపరాలపల్లి గ్రామ ఫారెస్ట్ ఏరియాలో పేకాట ఆడుతున్న వారిపై ములకలపల్లి పోలీసు లు శుక్రవారం చేశారు. నలుగురు వ్యక్తుల ను అదుపులోకి తీసుకున్నారు. సంఘటన ప్రాంతం నుంచి ఐదు ద్విచక్రవాహనాలు, రూ.6వేల నగదును, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సంఘటన స్థలం నుంచి పారిపోయిన నలుగురు వ్యక్తుల పేర్లు తెలుసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ దాడిలో ఎస్ఐ రాజశేఖర్, కానిస్టేబుల్ తిరుపతిరావు, రవికుమార్, రమణ, చిన్ని, భాస్కర్, తేజ తదితరులు ఉన్నారు.

# బాలుడిపై కుక్కదాడి

- తీవ్రగాయాలు కావటంతో జిల్లా హాస్పటల్‌కు తరలింపు
- వీవెంకటాయపాలెంలో వరుస సంఘటనలు



రఘునాథపాలెం, జనవరి24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వీ వెంకటాయపాలెంగ్రామం వీధికుక్కలకు అడ్డాగా మారింది. ఆరునెలల క్రితం ఇదే గ్రామంలో ఒకేవీధిలో ఒకేసారి ఇద్దరు పిల్లలపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చటంతో వారంరోజులు పాటు ప్రభుత్వ హాస్పటల్‌లో చికిత్స పొందారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగాచర్చనీయాంశంగా మారింది. అది మరవకు ముందే అదే గ్రామంలో వీధి కుక్క గేటుదూకి వెళ్లి మరి బాలుడుపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. వీ వెంకటాయపాలెం పంచాయతి పరిధిలోని జగ్యాతండాలో ఆరునెలల క్రితం ఇద్దరు పిల్లలపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. శుక్రవారం ఇదేగ్రామంలో ఈ ఘటన జరిగింది. గ్రామంలోని మూడ్ ప్రసాద్ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. శుక్రవారం చిన్నకుమారుడైన మూడ్ కౌశిక్‌సూర్యకు(పదినెలలు) వ్యాక్సిన్ ఇప్పించేందుకు ఖమ్మం తీసుకెళ్లేందుకు వారు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఇంటిముందు కౌశిక్‌సూర్యను ఉంచారు. ఈక్రమంలో రోడ్డు మీద వెళుతున్న వీధి కుక్క ఒక్కసారిగా గేటు దూకి వచ్చి బాలుడిపై దాడి చేసింది. వీపుపై తీవ్రంగా గాయపర్చింది. పిల్లవాడి అరుపులు విన్న తల్లి, దండ్రులు బయటకు వచ్చి కుక్కపై దాడి చేయటంతో పారిపోయింది. తర్వాత బాలుడ్ని జిల్లా ప్రభుత్వ హాస్పటల్‌కు వైద్య సేవలకు తరలించారు.

## ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్

# జాతీయ పోటీలకు ముగ్గురు ఉపాధ్యాయులు



ఖమ్మంస్పోర్ట్స్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): త్వరలో ఢిల్లీలో జరగనున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికైనారు. వారు ఈనెల 23, 24 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపి జాతీయపోటీలకు ఎంపికైనారు.బచ్చోడు పాఠశాలలో ఉపాధ్యాయుడు కొమ్ము విజయ్‌చందర్, మేడేపల్లి పాఠశాల ఉపాధ్యాయుడు ఏపూరి రవి, కామారెడ్డిలో ప్రధానోపాధ్యాయుడుగా పని చేస్తున్న నగరానికి చెందిన కనపర్తి కోటేశ్వరరావు ఎంపికయ్యారు. వీరిని పలువురు అభినందించారు.

# వన్య ప్రాణులను సంరక్షించాలి: డీఎఫ్‌వో కృష్ణగౌడ్



ఆళ్లపల్లి,జనవరి24(ఆంధ్రజ్యోతి):వేటగాళ్ల చేతుల్లో అంతరించిపోతున్న వన్య ప్రాణులను సంరక్షించి వాటిసంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణగౌడ్ అటవీశాఖ అధికారులకు సూచించారు.శుక్రవారం ఆయన రేంజి అడవులను సందర్శించి జంతువుల ఆవాసాలు,నీటికుంటలు, వివిధ రకాల వృక్షజాతి మొక్కలను పరిశీలించారు. మర్కోడు బీట్ పరిధిలోని నర్సరీని పరిశీలించారు.ఎవరైన అటవుల్లో వన్య ప్రాణులకోసం ఉచ్చులు ఏర్పాటు చేసిన, వేటాడిన, కలప స్మగ్లింగ్ చేసిన, పోడుభూముల కోసం అడవులను నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రేంజర్లకు, కిందిస్థాయి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీవో బాబురావు, రేగళ్ల రేంజర్ జశ్వంత్, ఆళ్లపల్లి రేంజర్ కిరన్, సిబ్బంది భాస్కర్, నారాయణసింగ్, తదితర అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.



# వందనం

కొణిజర్ల, జనవరి24 (ఆంధ్రజ్యోతి): జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని తనికెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 100 అడుగుల జాతీయ జెండాను గ్రామ పురవీధుల్లో ప్రదర్శించారు. దేశనాయకుల వేషాధరణతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ బాలికల దినోత్సవం ఆవశ్యకతను వివరించారు. కొంతమంది జాతీయజెండాకు సెల్యూట్ చేశారు.

# భద్రాద్రి జిల్లాలో లెక్క తేలింది

- రైతుభరోసాకు అర్హతలేని భూమి 2,800 ఎకరాలు

కొత్తగూడెం, జనవరి24(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లాలో రైతుభరోసాకు అర్హత లేని లెక్క తేలింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పంక్షన్‌హాళ్ల భూములు, రియల్‌ఎస్టేట్ లేఅవుట్లు ఉన్న కొండలు.. గుట్టలు, రాళ్ల రప్పలు పండని భూములు, ఇళ్ల కాలనీలకు సైతం రైతు బంధు జమ చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధుస్థానంలో రైతుభరోసా పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం అమలు చేసేందుకు ప్రభుత్వం పంటలు పండని భూములు, ఇతరాత్ర భూములు సర్వే నిర్వహించింది. దీంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రైతుభరోసాకు అర్హత లేని భూములను 2,800 ఎకరాలుగా గుర్తించారు. వీటిలో జిల్లా వ్యాప్తంగా రియల్‌ఎస్టేట్ లేఅవుట్లు, పట్టణాలు, మండలాల్లో ఉన్న వ్యవసాయేతర భూమి 1382 ఎకరాలుగా గుర్తించారు. ఇళ్లకాలనీలు నిర్మించుకున్న వ్యవసాయేతర భూమిని 450 ఎకరాలు, ప్రభుత్వ భూమి 682 ఎకరాలుగా గుర్తించారు. రాళ్లరప్పలు, గుట్టలు ఉన్నటువంటి పంటలు పండని భూమి 116 ఎకరాలను సర్వే అధికారులు గుర్తించారు. మొత్తం 2067ఎకరాలు సాగుయోగ్యంగా లేదని అధికార యంత్రాంగం గుర్తించింది. అయితే మణుగూరు, అశ్వాపురం ఇతరాత్ర ప్రాంతాల్లో సీతారామ ప్రాజెక్టు కింద రైతుల నుంచి 700 ఎకరాల భూమిని ఆ ప్రాజెక్టు కోసం అధికారులు సేకరించారు. ఈ 700 ఎకరాల రైతాంగ భూమికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం డబ్బులు మంజూరు చేస్తే ఆ భూమిని రైతుభరోసా నుంచి మినహాయింపు ఇస్తారు. నష్టపరిహారం డబ్బులు ఇవ్వని పక్షంలో ఆ 700 ఎకరాల భూమికి కూడ రైతు భరోసా వర్తిస్తుందని వ్యవసాయశాఖాధికారులు పేర్కొంటున్నారు. మొత్తం మీద జిల్లాలో సాగుకు యోగ్యంకాని భూమిని 2800ఎకరాలుగా తేలిందని చెప్పవచ్చు. సర్వే నెంబర్ల వారీగా క్షేత్రస్థాయి పరిశీలన చేసి గతంలో రైతుబంధు పథకం కింద అర్హత పొందిన భూమి నిజంగా వ్యవసాయ యోగ్యమా కాదా అనే కోణంలో కూడ పరిశీలన చేశారు. అర్హత లేని భూముల విషయాన్ని సర్వేలు నిర్వహించి నివేదికను కలెక్టర్‌కు ఇప్పటికే అందచేశారు. గ్రామసభలు ప్రారంభం కావడంతో భూముల సర్వేకు కొంత బ్రేక్‌పడిందని చెప్పవచ్చు.శుక్రవారం గ్రామసభలు ముగియడంతో మిగిలిన గ్రామాల్లో కూడ సాగుకు యోగ్యం కాని లెక్కలను అధికారులు తీయనున్నారు. అధికారులు వ్యవసాయానికి అనుకూలంగా లేనిభూమినితొలగిస్తున్నారు.ఈనెల 26 నుంచి రైతుభరోసా పథకాన్ని జిల్లా యంత్రాంగం ప్రారంభించనుంది. వారి వారి ఖాతాలకు ఎకరానికి రూ.6వేల చొప్పున రైతు భరోసాను అందించనున్నారు.

# రైతు ఉద్యమాలకు సంసిద్ధం కావాలి

- ఏఐకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు




పాల్వంచ టౌన్,జనవరి24(ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఏఐకేఎస్ ఆధ్వర్యంలో చేపట్టు ఉద్యమాలకు రైతులు సంసిద్ధం కావాలని ఏఐకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. శుక్రవారం పార్టీ కార్యాలయం సీఆర్ భవన్‌లో జరిగిన ఏఐకేఎస్ జిల్లా సమితి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయరంగాన్ని కార్పోరేట్ శక్తులకు దారాదత్తం చేస్తూ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. ఎటువంటి షరతులు లేకుండా రెండు లక్షల రుణమాఫీ చేయాలని ప్రభుత్వం చెబుతున్నా నూరుశాతంరుణమాఫీ జరగలేదన్నారు. రెండు సీజన్లకు సంబంధించిన రైతు భరోసా ఎకరానికి రూ.12వేలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా ఏఐకేఎస్ జిల్లా సమితి అధ్యక్షుడు సంద్ర నరేంద్రకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, చంద్రగిరి శ్రీనివాసరావు, కమటం సురేష్, కుమారి హనుమంతరావు, రవి, ఊకే నారాయణ, వాడే లక్ష్మి, నారటి రమేష్, కోటి నాగేశ్వరరావు,రంజిత్,సీతారాంరెడ్డి పాల్గొన్నారు,

## వ్యవసాయక్షేత్రంలో మిర్చిపంటను పరిశీలించిన తుమ్మల



దమ్మపేట,జనవరి24: గండుగులపల్లిలోని తన వ్యవసాయక్షేత్రంలో సాగు చేసిన మిరపపంటను శుక్రవారం సాయంత్రం వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. వివిధ రకాల మిర్చిపంటను సాగు చేయగా కాపుకు వచ్చిన మిరప పంటను పరిశీలించారు. పంటపై సంతృప్తి వ్యక్తం చేశారు. వ్యవసాయశాఖామంత్రిగా తుమ్మల ఖమ్మంలో పలు ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొని అనంతరం గండుగులపల్లి చేరుకున్నారు. కొద్దిసేపు వ్యవసాయక్షేత్రాన్ని సందర్శించి పంటలను పరిశీలించారు. ఆయినవెంట ఆలపాటి రాంచంద్రప్రసాదు, కేవి సత్యనారాయణ,కాసాని నాగప్రసాదు ఉన్నారు.

## రామాలయంలో వస్త్రాల పోగుకు వేలం ఖరారు

భద్రాచలంజనవరి24(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో భక్తులు సమర్పించే వస్త్రాలు పోగుచేసుకునేందుకు వేలం పాట ఖరారైంది. భద్రాచలంలోని ఈవో కార్యాలయంలో భక్తులు సమర్పించిన వస్త్రాలను పోగు చేసుకునేందుకు వేలం నిర్వహించారు. భద్రాచలానికి చెందిన ఎన్‌వీసీహెచ్ సుబ్బారావు రూ.50.25లక్షలకు దక్కించుకున్నారు. ఫిబ్రవరి ఒకటినుంచి 2026 జనవరి 31 వరకు ఆయనకు హక్కులు వర్తిస్తాయి. గతసంవత్సరం రూ.39,05,000కు ఖరారుగా ఈసారి అధికంగా వేలంపాటలో ఖరారు అయింది. అలాగే ఆరుదుకాణాలకు సైతం వేలంపాట ద్వారా హక్కులను ఖరారు చేశారు.ఈ కార్యక్రమంలో భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్ రమాదేవి,ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## క్రైం సమాచారం

### చెట్టుకు ఉరి వేసుకుని వ్యక్తి మృతి

కరకగూడెం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలాద్రిపేట వలస ఆదివాసీ గ్రామానికి చెందిన కుంజా ఇడుమయ్య (48) అనే వ్యక్తి శుక్రవారం మండలంలోని బర్లగూడెం గ్రామ సమీపంలోని చెరువుకట్టపై చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందిన సంఘటన కరకగూడెం మండలంలో జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలం వద్దకు వెళ్లి కేసు నమోదు చేశారు. కరకగూడెం ఎస్ఐ రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నీలాద్రిపేట వలస ఆదివాసీ గ్రామానికి చెందిన కుంజా ఇడుమయ్య సుమారు రెండు సంవత్సరాలుగా మతిస్థిమితం కోల్పోయి గతంలో రెండు మార్లు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు ఆచూకీ తెలుసుకుని ఇంటికి తీసుకువచ్చారు. శుక్రవారం ఇడుమయ్య ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయి బర్లగూడెం ఊరి చివరన ఉన్న చెరువుకట్టపై ఉరి వేసుకుని మృతి చెందినట్లు మృతిని భార్య కుంజా పొజ్జమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు. మృతునికి ఒక కుమారుడు, కూతురు ఉన్నట్లు తెలిపారు.

### మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య

పాల్వంచ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి ): మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాల్వంచలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం పాల్వంచ నవభారత్ ప్రాంతంలోని తెలంగాణ నగర్‌కు చెందిన షేక్ చాంద్‌పాషా(44) స్థానిక నవభారత్ కర్మాగారంలో క్యాజువల్ లేబర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 18న తన తరపు బంధువుల పెండ్లికి హాజరవడానికి సిద్ధమయ్యాడు. కానీ పిల్లలకు పరీక్షలు ఉన్నాయనే కారణంతో అతని భార్య, పిల్లలు ఫంక్షన్‌కు వెళ్ళడానికి అంగీకరించలేదు. దీంతో వారిని ఇంట్లోనే వదిలి ఆ ఫంక్షన్‌కు హాజరై 20న తిరిగి ఇంటికి చేరుకున్నాడు. కానీ అప్పటి నుంచి అతిగా మద్యం సేవిస్తూ తనలో తానే మదన పడుతూ ఉన్నాడు. తన తరపు బంధువుల ఇండ్లలో ఏ ఫంక్షన్ జరిగినా ఇంట్లో వారు రావడంలేదని మదనపడుతూ మానసికంగా కృంగిపోయాడు. ఈ క్రమంలోనే శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఇంటి వరండాలో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యా ప్రయత్నానికి ముందు మణుగూరులోని అతని అక్కకు ఫోన్ చేసి పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని, తాను చనిపోతున్నానని చెప్పాడు. దీంతో ఆమె చాంద్‌పాషా పెద్ద కుమారుడు ఇర్ఫాన్‌కు ఫోన్ చేసి అప్రమత్తం చేసింది. కానీ చాంద్‌పాషా కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకునే సరికి ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించడంతో హుటాహుటిన అతనిని పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే అతను మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య సమీరా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ సుమన్ తెలిపారు.

### లారీ బోల్తా.. వ్యక్తికి గాయాలు

మధిరటౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): లారీ బోల్తాపడి ఓ వ్యక్తికి గాయాలు అయిన సంగటన మధిర మండలంలోని సిరిపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం జరిగింది. మండలం లోని రొంపిమళ్ల నుంచి యండపల్లి ఇండస్ట్రియల్ పార్క్ వరకు నూతనంగా నిర్మిస్తున్న బీటీ రోడ్డుకు తారు తీసుకు వెళుతున్న లారీ ఎదురుగా గ్రావెల్ లోడు లారీకి సైడ్ ఇచ్చే క్రమంలో దిగబడి బోల్తా పడటంతో దానిలోని డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి.

### దంపతులకు గాయాలు

కామేపల్లి: బైక్‌ను టిప్పర్ లారీ ఢీకొన్న సంఘటనలో భార్యభర్తలకు తీవ్రగాయాలు అయిన సంఘటన కామేపల్లి మండల పరిధిలోని పొన్నెకల్ గ్రామ శివారులోని ఓ మూలమలుపు వద్ద శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం డోర్నకల్ మండలం దుబ్బతండ గ్రామానికి చెందిన ఇస్లావత్ భాష-సుజాత దంపతులు వారి కుమారుడుని బైక్ మీద ఎక్కించుకొని ఏన్కూర్ మండల మూల పోచారం హాస్టల్ దింపి తిరిగి వస్తుండగా పొన్నెకల్ శివారులో ఓ మూలమలుపు వద్ద టిప్పర్ వీరి బైక్‌ను ఢీకొట్టగా ఇరువురికి తీవ్రగాయాలు అవ్వడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# భద్రాద్రిలో విష్ణు సహస్ర నామ పారాయణం

8న చిన్నజీయర్‌స్వామి పర్యవేక్షణలో నిర్వహణ



ఫ్లెక్సీ, పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భద్రాచలం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ఫిబ్రవరి 8న భీష్మ ఏకాదశి-శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర జయంతిని పరస్కరించుకొని విరాట్ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భద్రాచలంలో శుక్రవారం జీయర్‌మఠం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గట్టు వెంకటాచార్య, ఎన్‌సీహెచ్ చక్రవర్తిలు ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. భద్రాద్రిలో నిర్వహించే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమంలో 25 వేల మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉందని ఈ సమయంలో అందరూ చిన్న జీయర్‌స్వామి నేతృత్వంలో విష్ణు సహస్రనామ పారాయణం చేస్తారని తెలిపారు. ఏడు రాత్రి చిన జీయర్‌స్వామి భద్రాచలం చేరకుంటారని, 8న తీర్థగోష్ఠి భద్రాద్రి రామయ్య దర్శనం అనంతరం జీయర్‌మఠం నుంచి శోభయాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఈసమయంలో భక్తుల కోలాటం, భజన బృందాలు కొమ్ము డ్యాన్సు విద్యార్థుల విచిత్ర వేషధారణలు, హరికథ గానాలతో శోభయాత్ర సాగుతుందన్నారు. పట్టణ పురవీదుల్లో సాగిన శోభయాత్ర జూనియర్ కళాశాల క్రీడామైదానంకు చేరుకుని ముందుగా గోపూజ, ధ్వజారోహణం, అనంతరం స్తోత్ర పారాయణం ప్రారంభమవుతుందన్నారు. ఇప్పటికే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, కొత్తగూడెం, పాల్వంచ, మధిర, అశ్వాపురం, మనుగరు, చర్ల, బేతంపూడి వికాస తరంగిణి బృందాలతో సమావేశం నిర్వహించి ప్రచారం చేపట్టడం జరిగిందన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు విష్ణ సహస్రనామ స్తోత్ర పారాయణ పుస్తకాలను జీయర్‌మఠం సంస్థలు ఉచితంగా అందిస్తాయన్నారు. జీయర్‌మఠం, వికాస తరంగిణి, భగవత్ రామానుజ సేవా సమితిల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమం అనంతరం భక్తులకు ప్రసాద వితరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు. ఈ విలేకర్ల సమావేశంలో జీయర్‌మఠం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులతో పాటు వికాస తరంగిణి, యువ వికాస్, ప్రజ్ఞా, ఆర్థిక సమన్వయకర్తలు పిన్నింటి కమల, చారుగుళ్ళ శ్రీనివాస్, చక్రవర్తుల రఘుపుంగవ, భద్రమారుతి నాగేశ్వరరావు, భగవత్ రామానుజాచార్యుల సేవా సమితి అధ్యక్షులు తాళ్లపూడి రాము, భద్రాద్రి కళాభారతి కార్యదర్శి అల్లం నాగేశ్వరావు పాల్గొన్నారు.

# సమానత్వం దిశగా ఆడపిల్లలు ఎదగాలి

కొత్తగూడెం అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బాలబాలికల నిష్పత్తిలో అంతరాన్ని సరిచేయడమే ధ్యేయంగా బేటీ బచావో.. బేటీ పడావో పథకానికి కేంద్రప్రభుత్వం జనవరి 24న శ్రీకారం చుట్టిందని, సమానత్వం దిశగా ఆడపిల్లలు ఎదగాలని, చదవాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ భానుమతి అన్నారు. శుక్రవారం బేటీ బచావో.. బేటీ పడావో పథకం దశాబ్ధకాలం పూర్తి అయిన సందర్భంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పాల్వంచలోని నవభారత్ టీజీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎల్ఎస్‌సీ సెక్రటరీ మాట్లాడుతూ.. "ఆడపిల్లలను కాపాడండి, చదివించండి" అనే సంకల్పంతో జాతీయ బాలికా దినోత్సవాన్ని అమలు చేసి దశాబ్ధకాలం అయిన సందర్భంగా విద్యార్థినీలకు జాతీయ బాలికా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆడపిల్లలు అన్ని రంగాల్లో అభ్యున్నతి సాదించాలని, సమాజంలో ఆడపిల్లలు లేనిదే సృష్టి లేదని, మగవారికన్నా అన్ని రంగాల్లో ముందజలో ఉన్నారన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి జెఎమ్. స్వర్ణలత లెనీనా మాట్లాడుతూ.. బాలల హక్కులు, బాల్య వివాహాలు, న్యూట్రిషన్ ఫుడ్ గురించి వివరించారు. ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ.. బాలల చట్టాలు, బాలల అక్రమ రవాణా, హెల్ప్ లైన్ నెంబర్లు 181, 1098 గురించి వివరించారు. టీజీఎస్‌ఎడబ్ల్యూఆర్‌జేసీ ఇంచార్జ్ హెచ్ఎం మిథిలా మాట్లాడుతూ.. బాలికల విద్య, మహిళా సమానత్వం, మహిళా సాధికారిత గురించి వివరించారు. తెలంగాణ సోషల్ వేల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజీలో 1 నుంచి 9వ తరగతి వరకు అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మెమెంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ సభ్యులు నిరంజన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# మేడా రాణికి పలువురి నివాళి



నివాళి అర్పిస్తున్న దుర్గా ప్రసాద్

వైరా, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విప్పలమడక గ్రామంలో అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందిన మేడా రాణికి పలు పార్టీల నాయకులు నివాళులర్పించారు. శుక్రవారం జరిగిన అంత్యక్రియల్లో కాంగ్రెస్, టీడీపీ బీఆర్ఎస్, సీపీఎం నేతలు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, వివి ధ పార్టీల నాయకులు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సంతాపం తెలిపారు.

## అభివృద్ధికి సహకరించాలి

ఖమ్మం మామిళ్లగూడెం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం రైల్వే స్టేషన్‌లో ఆధునికీకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు, ప్రయాణీకులు సహకరించాలని సీసీఐ ఎండీ జాఫర్ కోరారు. స్టేషన్ మోడరైజేషన్ పనుల్లో భాగంగా పాత స్టేషన్ భవనాన్ని, బుక్కింగ్ కౌంటర్లను కాలం చెల్లిన భవనాలు కూల్చివేయనున్నట్లు తెలిపారు. ప్రయాణీకులు, ప్రజలు ఈ పనులకు సహకారాన్ని అందించాలన్నారు. రెగ్యులర్‌గా ఈ స్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తున్న ప్రయాణీకులు తమ వాహనాలను ప్రత్యేకంగా కేటాయించిన పార్కింగ్‌లోనే ఉంచాలని సూచించారు. తమ వాహనాలను జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. ప్రయాణీకులకు కలుగుతున్న అసౌకర్యాన్ని గమనించాలన్నారు.



పట్టుకున్న గంజాయి, నిందితులతో అధికారులు

# 82 కేజీల గంజాయి పట్టివేత

భద్రాచలం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఒడిషా నుంచి కేరళకు అక్రమ రవాణా అవుతున్న గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు భద్రాచలంలో తనిఖీల్లో పట్టుకున్నారు. ఈ సందర్భంగా 82 కేజీల ఎండు గంజాయిని, కారుని స్వాధీనం చేసుకోగా ఇరువురు నిందితులను అరెస్టు చేశారు. శుక్రవారం ఒడిషా నుంచి కేరళకు కారులో అక్రమంగా తరలివెళ్తున్న గంజాయిని భద్రాచలం-కూనవరం రోడ్డు ఆర్టీవో చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నారు. కారు బ్యాక్ సీట్ల వెనుక ప్రత్యేక అరను ఏర్పాటు చేసి గంజాయిని తరలిస్తున్న వారిని పట్టుకున్నారు. పట్టుబడిన గంజాయి 82 కేజీలు ఉంటుందని ఎన్‌ఫోర్సుమెంట్ టీం సీఐ సుంకరి రమేష్ తెలిపారు. గంజాయిని తరలిస్తున్న కేరళలోని కాసర్‌గడ్‌కు చెందిన కొట్టపంజ బదురద్దీన్, అబ్దుల్ నిజాద్‌లను అరెస్టు చేశారు. కారు, రెండు మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న ఎండు గంజాయి విలువ రూ.50 లక్షలు ఉంటుందని అంచనా. గంజాయిని పట్టుకున్న అధికారుల బృందంలో సీఐ ఎస్.రమేష్, హెడ్ కానిస్టేబుల్ బాలు, కానిస్టేబుళ్లు సుదీర్, వెంకటేష్, హరీష్, విజయ్‌లు ఉన్నారు. గంజాయి పట్టుకున్న బృందాన్ని ఎక్సైజ్ ఎన్‌పోర్సుమెంట్ డైరెక్టర్ కమలహాసన్‌రెడ్డి, ఖమ్మం అసిస్టెంట్ కమిషనర్ గణేష్ అభినందించారు.

## అసిస్టెంట్ ప్లీడర్ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ఖమ్మం లీగల్ జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం సీనియర్ సివిల్‌జడ్జి కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌కై జనవరి 31 తేదీలోపుల అర్హత కలిగిన న్యాయవాదులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కోర్టు ముఖ్య పరిపాలనాధికారి హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను జిల్లా ప్రధాన న్యాయాధికారికి అప్లికేషన్‌తో పాటు కావాలిసిన ధృవీకరణ పత్రాలతో సమర్పించాలన్నారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఖమ్మం 'బార్' విష్ణువర్ధన్‌రెడ్డి రాక

ఖమ్మం లీగల్ జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బార్ కౌన్సిల్ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఖమ్మంలోని బార్ అసోసిమేషన్ శుక్రవారం మధ్యాహ్నం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు.

## నష్టపరిహారం చెల్లించాలని కమిషన్ తీర్పు

ఖమ్మం లీగల్ జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కొణిజర్ల గ్రామానికి చెందిన బండారు నరేష్‌బాబు ఖమ్మం నగర శ్రీనగర్ కాలనీలో ఉన్న కారు షోరూమ్ కాకతీయ టయోటాలో న్యూ ఇన్నోవా హైక్రాస్ హైబ్రీడ్ సేవన్ టీటర్ కారును ఆగష్టు 8, 2023న రూ. 50వేల రూపాయలు అడ్వాన్సుగా చెల్లించి కారును బుక్ చేసుకున్నాడు. షోరూమ్ వారికి ఫిర్యాదిదారుడు కారు ఖరీదు మొత్తం చెల్లించినప్పటికి కారు సరైన సమయంలో వాహనాన్ని అందజేయకపోవటంతో ఫిర్యాదిదారుడు కార్ షోరూమ్‌కి లీగల్ నోటీసు పంపించారు. అప్పటికీ కూడా షోరూమ్ వారు కారును ఇవ్వకపోవటంతో ఫిర్యాదిదారుడు ఫైనాన్స్ సంస్థకి రెండు నెలల ఇన్‌స్టాల్‌మెంట్ సైతం కట్టినాడు. అయినప్పటికీ షోరూమ్ వారు ఆ ప్రకారంగా కారుని ఇవ్వకపోవటంతో ఫిర్యాదిదారుడు ఖమ్మం జిల్లా వినియోగదారుల కమిషన్‌లో కేసు దాఖలుచేయగా ఫోరమ్‌లో ఉన్న వి.లలిత, మెంబర్ ఏ.మాధవీలతలు ధృవీకరణ పత్రాలు, సాక్షాదారాలను పరిశీలించి ఇరు పక్షాల వాదనలు విని కారు షోరూమ్ వారు ఫిర్యాదికి కారు సకాలంలో ఇవ్వనందున నష్టపరిహారంగా రూ. 40వేల రూపాయలను ఫిర్యాదికి ఇవ్వాలని తీర్పుచెప్పారు.

## పాలేరు నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలకు చెక్

కూసుమంచి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పాలేరు నియోజవర్గంలో ఇక విద్యుత్ సమస్యలకు చెక్ పడనుంది. నివాసాలపై నుంచి వెళ్లే 11కేవీ లైన్ల తొలగింపుకు, కొత్తగా అదనపు లైన్ల ఏర్పాటుకు రెవెన్యూశాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో నిధులు మంజూరీఅయ్యాయి. నేలకొండపల్లి, కూసుమంచి, ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం మండలాల్లో అనేక గ్రామాల్లో నివాసాలపైనుంచి 11కేవీ లైన్లు ఉన్నాయి. గాలిదుమారాలు వచ్చిన సమయాల్లో లైన్లు తెగడం వలన ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో నివాసాలపై 11కేవీ వైర్లు తొలగించేందుకు రూ.4.65కోట్లు, కొత్తలైన్ల ఏర్పాటుకు రూ.4.24కోట్లు మొత్తం 8.88 కోట్లు మంజూరీ చేశారు.

# ఉద్యోగుల సమష్టి కృషితోనే సంస్థ అభివృద్ధి

**కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్**



అవార్డులు పొందిన ఉద్యోగులతో కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమష్టి కృషితోనే సంస్థ అభివృద్ధి సాధ్యమవుతుందని సంస్థ అభివృద్ధికి డ్రైవర్లు, కండక్టర్ల పాత్ర కీలకమని కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుష్రోషాఖాన్ అన్నారు. శుక్రవారం నగరంలోని నూతనబస్టాండ్‌లో డ్రైవర్స్‌డే సందర్భంగా, ఉద్యోగులకు ప్రగతి చక్ర తృతీయ త్రైమాసిక అవార్డుల కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఉద్యోగులు బాధ్యతతో వ్యవహరించడంవల్ల అధిక ఆదాయం పొందడం సాధ్యమవుతుందన్నారు. ఆర్టీసీ అంటేనే ప్రజల్లో సురక్షిత ప్రయాణమనే నమ్మకం ఉందన్నారు. ఖమ్మం రీజియన్ పరిధిలో ఏడు డిపోలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పదిమంది డ్రైవర్లు, ఏడుగురు కండక్టర్లు, ముగ్గురు టిమ్‌డ్రైవర్లు, ఐదుగురు ప్రైవేటు బస్సుడ్రైవర్లను ముగ్గురు మెకానిక్‌లకు ప్రగతి రథ చక్ర అవార్డులు ప్రదానం చేసి సన్మానించారు. ఉత్తమ బస్‌స్టేషన్‌గా ఎంపికైన కల్లూరు బస్టాండ్ కంట్రోలర్ ,సత్తుపల్లి డిపో మేనేజర్‌ను సన్మానించారు. ఉద్యోగుల ప్రయకాణీకుల పట్ల మర్యాదగా ప్రవరిస్తూ ఎక్కువ ఆదాయం పెంచడానికి నిరంతరం కృషిచేయాలన్నారు. రీజయన్ పరిదిలో మొత్తం 29మంది ప్రగతి రథ చక్ర అవార్డులను అందుకున్నారు. అనంతరం ఖమ్మం నూతన బస్టాండ్, పాతబస్టాండ్లను సందర్శించి ప్రయాణీకులకు అందిస్తున్న సౌకర్యాలు పరిశీలించారు.ఈకార్యక్రమంలో రీజనల్ మేనేజర్ సరిరాం, డిప్యుటీఆర్ఎం ఎస్.భవానిప్రసాద్, డిప్యుటీ రీజనల్ మేనేజర్(ఆపరేషన్)పవిత్ర, ఖమ్మం డీఎం దినేష్‌కుమార్, సీఐ రామయ్య, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## మున్నేరు రిటైనింగ్ వాల్
# నిర్మాణ పనులు వేగిరం చేయాలి

- సమన్వయంతో భూసేకరణ చేయాలి
- నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



మున్నేరు గోడల నిర్మాణం పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంకలెక్టరేట్, జనవరి24(ఆంధ్రజ్యోతి): మున్నేరుకిరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మించేందుకు అవసరమైన భూసేకరణ, నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ రెవెన్యూ, నీటిపారుదలశాఖ అధికారులతో కలిసి మున్నేరు రిటైనింగ్ వాల్ కోసం భూసేకరణ పురోగతి, జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. రోజువారి ఎంత మేరకు పని జరగాలో ప్రణాళిక చేసి, కార్యాచరణ చేయాలని, పనులు పూర్తి చేసేందుకు అవసరమైన అదనపు బృందాలను ఏర్పాటు చేసి మరింత వేగిరం చేయాలన్నారు. వచ్చే వానాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని జూలై నెలలోపు ఎట్టి పరిస్థితులలోనూ పనులను పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రిటైనింగ్ వాల్‌లో నాణ్యత, నిర్మాణంలో ఉపయోగించే సిమెంట్, ఐరన్, కాంక్రీట్, మెటీరియల్, వాల్ క్యూరింగ్ విషయాలలో పాటించాల్సిన జాగ్రత్తలను కలెక్టర్ అధికారులకు వివరించారు. భవిష్యత్తులో ఎక్కువ మొత్తంలో వరద వచ్చిన సందర్భంలో కూడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా 3 లక్షల 50 వేల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యం అంచనాతో శాస్త్రీయంగా నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. గోడ నిర్మాణానికి సంబంధించి భూ సేకరణ ప్రకియ జరుగుతుందని తెలిపారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సంబంధించి సేకరించాల్సిన ప్రైవేట్ భూముల యజమానులతో చర్చించి ఆ భూములను వెంటనే స్వాధీనం చేసుకునే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు, ఈఈ అననేయ, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ రవికుమార్,ఆర్ఐ వహీద్ తదితరులు పాల్గొన్నారు.

**జాతీయ బాలికల దినోత్సవ పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్**

బాలికలు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకునే విధంగా గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ లో బేటీ పడావో బేటి బచావో పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. బేటీ బచావో బేటీ పడావో కు మద్దతుగా నిర్వహిస్తున్న క్యాంపెయిన్ ఫ్లెక్సీ పై సంతకం చేశారు. ఈ సందర్భంగా జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని కొణిజెర్ల మండలం తనికెళ్ళ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల విద్యార్థినులతో కలెక్టర్ ముచ్చటించారు. కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌ను విద్యార్థినుల కోరిక మేరకు చూపించారు. చాంబర్ లో కలెక్టర్లుగా పనిచేసిన వారి జాబితా చూపించి, జిల్లాలో అనేక మంది గొప్ప అధికారులు కలెక్టర్లుగా పని చేశారని, ఆర్బీఐ గవర్నర్‌గా పని చేసిన సుబ్బారావు సైతం గతంలో జిల్లాలో సేవలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, డీఆర్వో ఎం.రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో ఎన్. అరుణ, సూపరింటెండెంట్ కె. శ్రీనివాసరావు, డీఎంసీడీహెచ్ఇడబ్ల్యు ఎస్డీ సమ్రిన్ పాల్గొన్నారు.

## జీపీఎస్ ఉంటేనే ఇంధనం

- కేఎంసీకి రూ.7లక్షల ఆదా

ఖమ్మంసంక్షేమవిభాగం,జనవరి24(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలో పారిశుధ్య వాహనాల డీజిల్ దుర్వినియోగానికి కమిషనర్ అభిషేక్ అగస్త్య సాంకేతిక పరికరాలతో కళ్లెం వేశారు. కేఎంసీ పరిధిలో 45 ట్రాక్టర్లు, 45ఆటోలు, సెక్షన్ మిషన్1, జేసీబీలు 3, డీఆర్ఎఫ్ వాహనాలు2, వైకుంఠధామరధాలు3, డోజర్1 వాహనాలున్నాయి. ప్రతీరోజు కేఎంసీ ఆధ్వర్యంలో డీజిల్ పంపిణీ జరుగుతుంది. పారిశుధ్య వాహనాల నిర్వాహణపై అనేక విమర్శలు వెలువడ్డాయి. ఒక్కో ట్రాక్టర్, స్వచ్ఛభారత్ ఆటోలు తిరగాల్సిన ట్రిప్పుల కంటే తక్కువగా తిరుగుతూ ఎక్కువ డీజిల్‌ను పొయించే వారు. ఈక్రమంలో కమిషనర్ అభిషేక్ అగస్త్య పారిశుధ్య వాహనాలకు జీపీఎస్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. దీంతో నవంబరు వరకు ప్రతీనెల రూ.27లక్షల డీజిల్ బిల్లులు రాగా డిసెంబరులో మాత్రం రూ.20 లక్షలకే పరిమితమైనాయి. కేఎంసీకి డీజిల్ బిల్లుల రూపంలో రూ.7లక్షల వరకు ఆదా జరిగింది.

### జాతీయ మానవహక్కుల కమిటీ జిల్లా చైర్మన్‌గా పత్తికొండ

ఖమ్మంవ్యవసాయం జనవరి24 (ఆంధ్రజ్యోతి): జాతీయ మానవహక్కుల కమిటీ జిల్లా చైర్మన్‌గా పత్తికొండ శ్రీనివాస్‌ను హైదరాబాద్‌లో గురువారం ఎన్నుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు బద్దిపగడ శ్రీనివాసరెడ్డి నియామక ఉత్తర్వు అందజేశారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. సమాజంలో ఎక్కడ అన్యాయం జరిగినా పేదల పక్షాల నిలిచి చెప్పారు.



## పరిటాల రవికి ఘన నివాళి

ఖమ్మంమామిళ్లగూడెం, జనవరి24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు, పరిటాల రవి 20వ వర్ధంతిని శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. కేతినేని హరిష్ ఆధ్వర్యంలో పరిటాల రవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టేకులపల్లి పవర్ హౌజ్ సమీపంలో నిరుపేదలకు అన్నదానం చేశారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కన్నేటి పృథ్వీ, నాగండ్ల లక్ష్మణ్, చింతనిప్పు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

## రోడ్లపై సురక్షిత ప్రయాణం మన కర్తవ్యం

- ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు

ఖమ్మంక్రైం, జనవరి24(ఆంధ్రజ్యోతి): రోడ్లపై ప్రతిఒక్కరు సురక్షితంగా ప్రయాణించేలా చూసుకోవడం మనందరి కర్తవ్యమని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు అన్నారు.రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా శుక్రవారం ప్రజలకు అవగాహన కలిపించేందుకు నెహ్రూయువకేంద్రం, ఉమెన్స్ డిగ్రీకాలేజీ విద్యార్థులు, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఏటా లక్షా50వేల మందిపైగా రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నారని నివేదికలు చెబుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ మోహన్‌బాబు, ఆర్ఐ సాంబశివరావు, నెహ్రూయువ కేంద్రం ప్రోగ్రాం ఆఫీసర్ భానుచందర్,రామకుమారస్వామి, శ్యామలాదేవి, షారుక్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



గులాబీలు అందించి ప్రమాదాలపై సూచనలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

## వద్దిరాజు జన్మదిన వేడుకలు

ఖమ్మం,జనవరి24(ఆంధ్రజ్యోతి):రాజ్యసభ సభ్యుడు బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు వద్దిరాజు రవిచంద్ర జన్మదినవేడుకలు శుక్రవారం ఖమ్మంలో ఘనంగా జరిగాయి. తన ఇంటివద్ద బీఆర్ఎస్ కార్యాలయంలోను కేక్‌కట్ చేశారు బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పలువురు నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సాయంత్రం హైదరాబాదులో బీఆర్స్ అధినేత మాజీ సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.



## జర్నలిస్టుల సమావేశం

ఖమ్మంకలెక్టరేట్, జనవరి24(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకోసం, సమస్యల పరిష్కారానికి ఆందోళనలు నిర్వహించాలని జర్నలిస్టు నాయకులు నిర్ణయించారు. శుక్రవారం మూడు యూనియన్ల ఉమ్మడి సమావేశాన్ని టీఎన్జీవో ఫంక్షన్‌హాల్లో నిర్వహించారు.ఇళ్లస్థలాల సాధనలో భాగంగా ఒకవైపు లాబీయింగ్ ప్రక్రియను కొనసాగిస్తూనే, మరొకవైపు జర్నలిస్టుల ఆవేదనను తెలియ చెప్పాలని అభిప్రాయపడ్డారు.

## చోరీకి పాల్పడిన నిందితుడి అరెస్ట్

ఖమ్మం క్రైం,జనవరి24(ఆంధ్రజ్యోతి): నగరంలో ఓ ఇంటిలో చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు టూటౌన్ సీఐ బాలక్రిష్ణ శుక్రవారం రాత్రి తెలిపారు. నగరంలోని మయూరి సెంటర్‌వద్ద శుక్రవారం తనిఖీలు నిర్వహిస్తుండగా విజయవాడ కొత్తపేటకు చెందిన ఓ వ్యక్తి అనుమానస్పదంగా కనిపించాడు. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారంచగా... నగరంలోని మామిళ్ళగూడెంలోని వనం నరసింగరావు ఇంట్లో ఈనెల 6న చోరీకు పాల్పడినట్టు తెలిపాడు. దీంతో అతడి నుంచి 75గ్రాముల బంగారు వస్తువులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.



## ప్రభుత్వ ఉద్యోగులకు పథకాలు ఎలా ఇచ్చారు

**నాలుగోరోజూ అధికారులను నిలదీసిన ప్రజలు**

ఖమ్మంరూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారిని వదిలిపెట్టి ప్రభుత్వ ఉద్యోగస్తులకు ఇందిరమ్మ ఇళ్లు,రేషన్ కార్డులు అందించడం ఏమిటని గ్రామసభల్లో ప్రజలు అధికారులను నిలదీశారు. ఖమ్మం రూరల్ మండలంలోని పెద్దతండా, ఏదులాపురం, తదితర గ్రామాల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో లిస్టులో ఉన్న పేర్లు చదువుతుండగా ప్రభుత్వ ఉద్యోగస్తులకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు లిస్టులో పేర్లు రావడం ఏమిటని అధికారులను నిలదీశారు. పెద్ద సంఖ్యలో భూములు ఉన్నవారికి, ప్రభుత్వ ఉద్యోగం ఉన్నవారి కుటుంబాల వారికి ఇళ్లు, రేషన్ కార్డులు ఇవ్వడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. తహసీల్దార్ రాంప్రసాద్ మాట్లాడుతు జాబితాలో పేర్లు లేనివారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కుమార్,ఆర్ఐలు ప్రసాద్, క్రాంతి పాల్గొన్నారు.

## మైనారిటీ కళాశాలను సందర్శించిన డీఐఈవో



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఐఈవో

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రాపర్తినగర్ మైనారిటి బాలికలు జూనియర్ కళాశాలను శుక్రవారం జిల్లా ఇంటర్మీడియట్ కె రవిబాబు సందర్శించారు. కళాశాలలోని వివిధ విభాగాల తోపాటు ల్యాబ్, డిజిటల్ తరగతుల సదుపాయాలను పరిశీలించారు. సిబ్బంది, విద్యార్థుల హజరు పట్టికను తనిఖీ చేశారు. ఆహార నాణ్యతను పరిశీలించారు. కళాశాల నిర్వాహణ, విద్యా ప్రమాణాల పెంపు తదాతర అంశాలపై ప్రిన్సిపాల్, సిబ్బందితో పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అఖిల పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు ఆహ్వానం

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి24(ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యాసంవత్సరంలో ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ అడ్మిషన్లకు ఈనెల27 నుంచి 29 వరకు గడువు అందుబాటులో ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ పాపారావు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు సంబదిత ఓపెన్ స్కూల్ పాఠశాలల, కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోని అప్లికేషన్ తోపాటు సంబంధిత ధ్రువపత్రాలతో ఆయా పాఠశాలలు, కళాశాలల్లో అందించాలని తెలిపారు.

## 'రైతుభరోసా'కు దరఖాస్తు చేసుకోవాలి

ఖమ్మంరూరల్,జనవరి24(ఆంధ్రజ్యోతి): రైతులు రైతు భరోసా పథకం వర్తించని వారు దరఖాస్తు చేసుకోవాలని ఏవో నాగేశ్వరరావు శుక్రవారం ఓప్రకటనలో తెలిపారు.జనవరి 1వరకు రెవెన్యూశాఖ నుంచి పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు అర్హులన్నారు. గతంలో రైతుభరోసా పొందే వారు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరంలేదన్నారు.

## నేడు ఆటకావాలా.. పాటకావాలా

ఖమ్మంసాంస్కృతికం,జనవరి24(ఆంధ్రజ్యోతి): మొగిలి ఎంటర్‌టైనమెంట్స్ ఆధ్వర్యంలో ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో శనివారం సాయంత్రం ఆటకావాలా పాటకావాలా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకుడు మొగిలి గుణకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిరంజీవి నటించిన హిట్ చిత్రాల్లోని పాటలను పాడటంతో పాటు నృత్యాలను ప్రదర్శిస్తారని తెలిపారు.

## క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం





జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఏడీసీపీ నరేష్‌కుమార్, చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్

ఖమ్మంస్పోర్ట్స్‌జనవరి24(ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం ఏర్పడుతుందని అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ నరేష్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని శ్రీచైతన్య గ్లోబల్‌విస్తా పాఠశాలలో 'ఉడాన్ క్రీడాపోటీలను ప్రారంభించి మాట్లాడారు. చిన్నతనం నుంచే క్రీడలను నేర్చుకోవడం ద్వారా చదువులోనూ ముందుంటారని పేర్కొన్నారు. డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. పాఠశాలలో రెండు రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో సుమారు 1500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. బాస్కెట్‌బాల్, వాలీబాల్, చెస్, క్యారమ్స్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య, ఏజీఎం చేతన్ మాథుర్, ప్రిన్సిపాల్ జయసుధ ఉన్నారు.

## భక్తరామదాసు సర్వీస్ సొసైటీ అధ్యక్షుడిగా ఏటుకూరి



నేలకొండపల్లి, జనవరి24(ఆంధ్రజ్యోతి):నేలకొండపల్లి భక్తరామదాసు సర్వీస్ సొసైటీ అధ్యక్షుడిగా సొసైటీ కార్యవర్గ సభ్యుడు, బోదులబండకు చెందిన ఏటుకూరి ప్రకాశరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా గెల్లా వెంకటరమణగుప్తా, కోశాధికారిగా దండా రవీంద్రబాబులు ఎన్నికయ్యారు. మిగిలిన కార్యవర్గాన్ని అధ్యక్షుడు తర్వాత ప్రకటించనున్నారు. ఫౌండర్ చైర్మన్ గెల్లా జగన్మోహన్‌రావు అధ్యక్షుడు, ఇతర కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ అధ్యక్షుడు పొన్నగాని శ్రీనివాస్, వెల్లంపల్లి శ్రీనివాసరావు, యలమద్ది లెనిన్, మచ్చా రఘుపతిరావు, వల్లచెట్ల భాస్కరరావు,ఉపాధ్యక్షుడు తెల్లగొర్ల లింగస్వామి,కార్యవర్గ సభ్యులు చావా గణపతిరావు, వాసం లక్ష్మయ్య, నంచర్ల దేవీప్రసాద్, కొత్తా రమేష్, పచ్చా తిరుపతయ్య, ఓరుగంటి నారాయణరావు, అనంతు కాశయ్య,గరిజె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో మాజీ ఎంపీటీసీ మృతి

కామేపల్లి,జనవరి24(ఆంధ్రజ్యోతి):పొన్నెకల్ మాజీ ఎంపీటీసీ గింజల లక్ష్మారెడ్డి(85)అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. కామేపల్లి మండలం పొన్నెకల్ గ్రామానికి చెందిన లక్ష్మారెడ్డి పొన్నెకల్ ఎంపీటీసీ పని చేసి ప్రజల మన్ననలను పొందారు.

## పథకాలను అడ్డుకుంటున్న బీఆర్ఎస్

**గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు**

కూసుమంచి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పదేళ్ల కాలంలో ఒక్క రేషన్‌కార్డు పక్కా నివాసగృహాలు ఇవ్వటానికి చేతకాని బీఆర్ఎస్ పాలకులు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ పథకాల మంజూరీని అడ్డుకోవడం సిగ్గు చేటని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కూసుమంచి వచ్చిన సందర్భంగా ఆయ పార్టీ నాయకులతో మాట్లాడుతు బీఆర్ఎస్ పాలనలో ఎవ్వరికైనా రేషన్ కార్డులు, పక్కా ఇళ్లు ఇచ్చారా అని ప్రశ్నించారు. ఎక్కడైన తప్పులు జరిగితే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. ఇప్పుడు సర్వేల్లో చెప్పిన పేర్లు అనర్హులుంటే తొలగిస్తారని, అదేవిధంగా అర్హులుంటే దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో హఫీజుద్దీన్, సొసైటీ వెంకన్న, చాట్ల పరుశురాం, కలీం, బెల్లంకొండ కిరణ్ పాల్గొన్నారు.



## అందరి భాగస్వామ్యంతో అభివృద్ధి

**కేఎంసీలో మేయర్ జన్మదినోత్సవం**





ఖమ్మంసంక్షేమ విభాగం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారం, ఖమ్మం నగర పాలక సంస్థలోని ఉద్యోగుల అందరి సమన్వయంతో ఖమ్మం ఎంతో అభివృద్ధి సాధిస్తోందని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. కేఎంసీ మేయర్ ఛాంబర్‌లో శుక్రవారం మేయర్ పునుకొల్లు నీరజ జన్మదినోత్సవం నిర్వహించారు. కార్పొరేటర్ రావూరి కరుణ, మహిళా అధికారులు వసుందర, బెల్లం రాధిక, సుజాతతో కలిసి మేయర్ పునుకొల్లు నీరజ కేక్ కట్ చేశారు. కమిషనర్ అభిషేక్ ఆగస్త్య మేయర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, కార్పొరేటర్లు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, పాలేపు విజయవెంకటరమణ, కొప్పెర సరితాఉపేందర్, కాంట్రాక్టర్లు పసుపులేటి వెంకటేశ్వర్లు, తమ్మిశెట్టి వెంకటనారాయణ, జోగల్ కిషోర్, బండి సతీష్, బత్తుల తిరుమలరావు, సరిరాజు శ్రీహరిరాజు, మేహర్ కిషోర్, పొనుగోటి శ్రీధర్, పాలకుర్తి కృష్ణ మేయర్‌ను సన్మానించారు.

## ఖమ్మం చేరిన కలాం స్ఫూర్తి యాత్ర

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి24(ఆంధ్రజ్యోతి): ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తితో ప్రారంభమైన కలాం స్ఫూర్తియాత్ర శుక్రవారం ఖమ్మం నగరంలోని శాంతినగర్ ప్రభుత్వ పాఠశాలకు చేరుకుంది. విద్యార్థులల్లో సాంకేతిక పట్ల ఆసక్తి కలిగించటమే యాత్ర ప్రధమ లక్ష్యమని కలాం స్ఫూర్తి యాత్ర వ్యవస్థాపకుడు మధులాష్‌బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణకుమారి, ఏఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరావు, కోఆర్డినేటర్ డాన్‌బోస్కో పాల్గొన్నారు.

## అర్హులైన వారికి ఇళ్లు, రేషన్ కార్డులు ఇవ్వాలి

తిరుమలాయపాలెం, జనవరి24(ఆంధ్రజ్యోతి):అర్హులైన నిరుపేదలదరికి రేషన్‌కార్డులు, ఇండ్లస్థలాలు, ఇందిరమ్మ ఆత్మీయభోరసా వర్తింపచేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా నాయకులు కె.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని రాయల వెంకటనారాయణ స్మారక భవనంలో పార్టీనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకోసం మండలంలో నిరుపేదలు దరఖాస్తు చేసుకుంటే నిజమైన లబ్ధిదారుల పేర్లు రాలేదన్నారు.

## 'పాలిటెక్నిక్' పోటీల్లో ఎస్‌బీఐటీ విద్యార్థుల ప్రతిభ

ఖమ్మంస్పోర్ట్స్‌జనవరి24 (ఆంధ్రజ్యోతి): ఈనెల22,23 తేదీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రుద్రంపూర్ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి క్రీడాపోటీలలో తమ కళాశాలలో డిప్లోమా చదువుతున్న విద్యార్థులు ప్రతిభ చూపి బహుమతులు సాధించారని కళాశాల చైర్మన్ గుండాల క్రిష్ణ తెలిపారు. విద్యార్థులు కబడ్డీ పోటీలో ప్రథమ బహుమతి సాధించగా, లాంగ్ జంప్‌లో తృతీయ, షాట్‌పుట్‌లో ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నారని తెలిపారు.కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ ధాత్రి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, గుండాల ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సీబీఎఫ్ సేవలు అభినందనీయం

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి24 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల జీవన పోషణకోసం చేగువేరా భూపతి ఫౌండేషన్ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని షెడ్యూల్డు కులాల సంస్థ అభివృద్ధి డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ అన్నారు. శుక్రవారం రాపర్తినగర్ చెగువేరా ఫౌండేషన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు,చైర్మన్ జి.చంద్రశేఖర్, గంటా బీమయ్య, మాచర్ల కొండలరావు, కొండా సందీప్,గంటాకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

## విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

ఏన్కూరు, జనవరి24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని అడిషనల్ జాయింట్ కలెక్టర్ శ్రీజ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల లో చిన్నారి ప్రోగ్రాం కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలు, మంచి స్పర్శ, చెడుస్పర్శ, మాదకద్రవ్యాలు, సైబర్‌నేరాలు తదితర అంశాలపై విద్యార్థులకుఅ అవగాహణ కల్పించారు. పదో తరగతిలో 10 జీపీఏ సాధనకు తీసుకోవాల్సిన మెళకువలను సూచించారు.మధ్యాహ్నం భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కూరాకుల సైదయ్య, డాక్టర్ మౌనిక, డాక్టర్ లాస్య, గురుప్రసాద్, అరుణ,పుష్పరాణి, లీగల్‌సెల్ అంజలి, సఖి సరిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో

# అగ్రభాగాన తెలంగాణ

**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

వైరా, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాల్లో అగ్రగామిగా పయనిస్తుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. వైరా శాస్త్రా నగర్‌లోని శ్రీసత్యసాయి వేదపాఠశాల ఆవరణంలో భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం నిర్వహించిన దేవతామూర్తులు సీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవ వేడుకల్లో మంత్రి తుమ్మల ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కల్యాణ మహోత్సవాన్ని మంత్రి తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయిబాబా ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని, వ్యవసాయ రంగం పాడిపంటలు సంపృద్ధిగా ఉండాలని ఆకాంక్షించారు. సీతారామచంద్రస్వామి ఆశీస్సులతో సీతారామ ప్రాజెక్టు కల సాకారమైందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితర నాయకులను ఘనంగా సన్మానించారు. సత్యసాయి సేవసమితి జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు, సభ్యుడు డాక్టర్ కాపా మురళీకృష్ణ, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, నాయకుడు గుత్తా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# 'ఇందిరమ్మ' ఆత్మీయ భరోసా జాబితాలో అవకతవకలు

**విచారణ జరిపి అధికారులు చర్యలు తీసుకోవాలి**

**చెన్నూరు గ్రామ ఉపాధి కూలీల డిమాండ్**

**పారదర్శకంగా జాబితాలను తయారుచేయాలి: ఎమ్మెల్యే**



విచారణ జరపాలంటున్న ఉపాధి కూలీలు

కల్లూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితాలో అవకతవకలు జరిగాయని ఆ గ్రామానికి చెందిన పలువురు ఉపాధి కూలీలు ఆరోపించారు. ఈ మేరకు సదరు జాబితాలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌లకు, ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం వారు ఫిర్యాదు కూడ చేశారు. చెన్నూరు గ్రామ ఉపాధి కూలీలు కంచెపోగు వీరయ్య, లక్ష్మణ్‌రావు, రాము, ఏసు, రాములు విలేకరులకు తెలిపిన సమాచారం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో జరిగిన గ్రామసభలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో ఏనాడు పనికి రాని వారికి , పనికి వచ్చినట్లుగా మస్టర్లు వేసి అక్రమంగా కూలీ నగదు డ్రా చేయటం, దీని ఆధారంగా కొంతమంది అనర్హుల పేర్లను ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితాలో చదవటం జరిగింది. దీనిపై బాధిత కూలీలు గ్రామ సభలో తీవ్రమైన అభ్యంతరం వ్యక్తం చేశారు. అనర్హుల పేర్లు జాబితాలో ఎలా చేర్చారని వారు అధికారులను ప్రశ్నించారు. మరోవైపున సదరు కూలీలు సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి దృష్టికి నేరుగా తీసుకెళ్లటంతో స్పందించి జాబితాలో అనర్హుల పేర్లను తొలిగించి పారదర్శకంగా జాబితాలు తయారి చేయాలని మండల అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో రూపొందించిన జాబితాలో అవకతవకలకు పాల్పడిన విషయమై తగిన విచారణ జరిపి అర్హులైన వారికి న్యాయం చేయాలని స్థానికంగా ఉపాధి కూలీలు అధికారులకు డిమాండ్ చేశారు. చెన్నూరు గ్రామంలో ఉపాధి కూలీల పనులపై ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితా తయారిపై జరిగిన అవకతవకలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎంపిడిఓ చంద్రశేఖర్ విలేకరులకు తెలిపారు.

## అప్రమత్తతతో వ్యవహరించాలి



ఉత్తమ ఉద్యోగులకు సన్మానం

సత్తుపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణకు డ్రైవర్లు అప్రమత్తతో వ్యవహరించాలని సత్తుపల్లి ఎంవీఐ జేఎన్.శ్రీనివాసరావు, పట్టణ సీఐ టీ.కిరణ్ అన్నారు. డ్రైవర్స్ డే సందర్భంగా శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపోలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపోతో పాటు పట్టణంలోని ర్యాలీ నిర్వహించి డ్రైవర్లందరికీ గులాబీ పువ్వు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 20ఏళ్లుగా ప్రమాద రహిత డ్రైవర్లుగా గుర్తింపు పొందిన అబ్దుల్‌గఫార్, ఉత్తమ ప్ర తిభ కనబరిచిన మెకానిక్ అమర్‌నాథ్, శ్రామిక్ మహేంద్రలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఎం యూ.రాజ్యలక్ష్మీ, అసిస్టెంట్ మేనేజర్ పీ.విజయశ్రీ పాల్గొన్నారు.

# రైతుల ఖాతాలో బోనస్ జమచేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

వైరా, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సన్నరకాల ధాన్యం క్వింటా ఒక్కింటికి ప్రకటించిన రూ.500బోనస్‌ను వెంటనే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని, రూ.రెండులక్షల రుణమాఫీ పూర్తిగా అమలుచేయాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం వైరా రెవెన్యూ కార్యాలయం వద్ద ఈ డిమాండ్లతో రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావుకు ఒక వినతిపత్రం సమర్పించారు. అనంతరం రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ధాన్యానికి బోనస్ గత 45రోజుల నుంచి రైతుల ఖాతాల్లో జమచేయడం లేదని ఆరోపించారు. వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు ఆలస్యం కావడం వలన వరికోతలు డిసెంబరు రెండోవారం నుంచి ప్రారంభమై ఇప్పటికీ కొనసాగుతున్నాయంటూ మొదటి రెండు,మూడురోజులు ధాన్యం విక్రయించిన రైతులకు మాత్రమే బోనస్ సొమ్ము రైతుల ఖాతాల్లో జమఅయిందన్నారు. ఆతర్వాత నుంచి బోనస్ సొమ్ము మొత్తం పెండింగ్ ఉందని వెంటనే విడుదల చేయాలని, రూ.రెండులక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతుసంఘం నాయకులు కిలారు శ్రీనివాసరావు, చింతనిప్పు చలపతిరావు, బాణాల శ్రీనివాసరావు, పైడిపల్లి సాంబశివరావు, కురుగుంట్ల శ్రీనివాసరావు, రుద్రాక్ష నర్సింహాచారి, గుమ్మా నర్సింహారావు, రామకృష్ణ, తోట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# విశ్రాంత ఉద్యోగులకూ పీఆర్‌సీ అమలు చేయాలి



సన్మానం పొందిన వారితో పువ్వాళ్ల, బొర్రా రాజశేఖర్

వైరా, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకు పీఆర్సీ అమలుచేయాలని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పైడిపల్లి శరత్‌బాబు కోరారు. పెన్షనర్స్‌డేను పురస్కరించుకొని శుక్రవారం వైరాలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం విస్తృత కార్యవర్గ సమావేశాన్ని పి.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్ అతిథులుగా పాల్గొన్నారు. శరత్‌బాబు మాట్లాడుతూ 2023 జూలై నుంచి అమలుకావల్సిన పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించి ఆచరణలో పెట్టాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదని, 2023 జనవరి నుంచి అమలుచేయకుండా వాయిదా వేస్తున్న డీఆర్‌లు వెంటనే విడుదల చేయాలని, రిటైర్డ్ ఉద్యోగుల భాగస్వామ్యంతో రాష్ట్రస్థాయిలో ఒక ట్రస్టు ఏర్పాటుచేసి విశ్రాంత ఉద్యోగులకు నగదు రహిత వైద్యం అందించాలని కోరారు. దుర్గాప్రసాద్, రాజశేఖర్ మాట్లాడుతూ జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రులతో మాట్లాడి రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆఇద్దరితో పాటు సీనియర్ పెన్షనర్లను ఘనంగా సన్మానించారు. ఆసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కల్యాణం కృష్ణయ్య, కృష్ణయ్యసూరి, మేదరమెట్ల సుబ్బయ్య, వేణు, వైరా ఏటీవో ప్రసన్నకుమార్, ఎస్టీవోలు ఎల్లయ్య, వేలాద్రి, టీఎన్‌జీవోస్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, ఎస్‌బీఐ మేనేజర్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## భవిష్యత్ బీఆర్ఎస్‌దే

ఎర్రుపాలెం, జనవరి24 (ఆంధ్రజ్యోతి): కొందరు నేతలు పార్టీ మారినంతమాత్రాన పోయేదేమిలేదని కాంగ్రెస్‌తో ప్రజలు విసుగెత్తిపోయారని ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ గెలుస్తుందని మాజీ జడ్పీ చైర్మన్ లింగల కమల్‌రాజు అన్నారు. ఎర్రుపాలెం మండల కేంద్రంలో గల బీఆర్ఎస్ కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాజీ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీచైర్మన్ నాగేశ్వరరావు, బీఆర్ఎస్ పార్టీ బోనకల్, చింతకాని మండల అధ్యక్షుడులు బంధం శ్రీనివాసరావు, పెంట్యాల పుల్లయ్య, మండల కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, మాజీజడ్పీటీసీ కవిత, మాజీ ఎంపీటీసీలు మస్తాన్‌వలీ, మల్లికార్జునరెడ్డి, కృష్ణారావు, నరసింహ పాల్గొన్నారు.

## మూడు మండలాల కబడ్డీ పోటీల ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఇమ్మడి

కారేపల్లి జనవరి24 (ఆంధ్రజ్యోతి): క్రామేడ్ యువసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు మండలాల కబడ్డీ పోటీలను శక్రవారం జిల్లా కాంగ్రెస్ నాయకుడు ఇమ్మడి తిరుపతిరావు ప్రారంభించారు. కారేపల్లి, కామేపల్లి, గార్ల మండలాలస్థాయి పోటీలను మండల కేంద్రంలోని వైఎస్ఎన్ గార్డెన్స్ రోడ్డులో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతిగా 10.116, ద్వితీయ బహుమతిగా 5.116,తృతీయ బహుమతిగ 3.116అందచేయనున్నారు. ఈ కార్యక్రమంలో సోసైటి చైర్మన్ దుగ్గినేని శ్రీనివాస్‌రావు,జిల్లా నాయకుడు బాణోత్ రాంమూర్తి,మల్లెల నాగేశ్వరరావు, తొగరశ్రీనివాస్, షబ్బీర్, అదెర్ల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్ ఫెయిర్‌లో అత్యుత్తమ ప్రతిభ



ఏన్కూరు, జనవరి24(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశ స్థాయి సైన్సుఫెయిర్ కు ఖమ్మంజిల్లా నుంచి ఏన్కూరు మండలం బురదరాగవాపురం జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎంపికయింది. ఈ పాఠశాల విద్యార్థులు కె.మహిమ, ఎస్‌కే షాహిర్ పాషా తయారుచేసిన గణితవిభాగం విజువలైజింగ్ ఎగ్జిబిట్‌ను ఈనెల 21నుండి 25వరకు పాండిచ్చేరిలో జరుగుతున్న సైన్సుఫెయిర్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. ఈప్రదర్శనలో తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరి రాష్ట్రాలు పాల్గొని 210 ఎగ్జిబిట్లు ప్రదర్శించినట్లు గైడ్ టీచర్లు సాగి సుజాత, పొట్ట రామారావు తెలిపారు.

## కార్పొరేట్ సంస్థలకిచ్చే సబ్సిడీలు ఆర్టీసీకీ ఇవ్వాలి

మధిర, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేసేందుకు కార్పొరేట్ సంస్థలకు ఇచ్చే సబ్సిడీని ఆర్టీసీకీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఎస్‌డబ్ల్యుఎఫ్, ఎస్‌డబ్ల్యుయూ సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు తమ డిమాండ్లతో కూడిన బ్యాడ్జీలను ధరించి శుక్రవారం విధులకు హాజరై తమ నిరసన తెలిపారు. ఎలక్ట్రికల్ బస్సు పథకంలో సవరణ చేయాలని ఆర్టీసీనే నేరుగా ఎలక్ట్రికల్ బస్సులను కొని నడిపే విధానం అమలుచేసి నిధులు సమకూర్చాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జె పద్మావతి, ఎస్‌డబ్ల్యుయూ డిపో కార్యదర్శి ఎం నాగేశ్వరరావు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

# 'రూ.500 బోనస్ చెల్లించాలి'



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

వేంసూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సన్నరకం ధాన్యానికి రూ.50బోనస్‌ను వెంటనే తమ ఖాతాల్లో ప్రభుత్వం జమచేయాలని శుక్రవారం రైతులు తహసీల్దార్ ఎం.ఎ.రాజుకు ఒక వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమ ధాన్యాన్ని కాంటాలు వేసి నెలరోజులు దాటినప్పటికీ నేటికి రూ.500బోనస్‌ను తమ ఖాతాల్లో జమచేయలేదని పేర్కొన్నారు. వెంటనే రూ.50బోనస్‌ను చెల్లించాలని ఆవినతిపత్రంలో కోరారు. కొంతమంది రైతుల ధాన్యాన్ని లారీకి 27టిక్కీలు తరుగు అని కటింగ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కూడా పరిశీలించాలని రైతులు కోరారు. కార్యక్రమంలో రైతులు అర్వపల్లి జగన్మోహన్‌రావు, ఎం.రవీంద్రబాబు, పోట్రు సత్యనారాయణ, వెల్లంకి శ్రీనివాసరావు, మోరంపూడి వెంకటేశ్వరరావు, కె.నరేష్, జి.మోహన్‌రావు, ఏ.కేశవరావు, ఎం.సుబ్బారావు, వెంకటరత్నం, మోహన్‌రావు పాల్గొన్నారు.

# సమష్టి కృషితోనే పట్టణాభివృద్ధి

**మునిసిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్**



చైర్మన్ మహేష్‌ను సన్మానిస్తున్న పాలకవర్గం, అధికారులు, సిబ్బంది

సత్తుపల్లిరూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కరోనా వంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రోత్సాహంతో పట్టణాన్ని అభివృద్ధి చేసుకున్నామని మునిసిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ అన్నారు. మునిసిపల్ పాలకవర్గం ఈ నెల 27వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో శుక్రవారం చివరి కౌన్సిల్ సమావేశం నిర్వహించి పలు తీర్మానాలను అంగీకారం తెలిపారు. వార్డుల్లో కౌన్సిలర్ల అభిష్టం మేరకే పనిచేశామని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, ఎస్‌డీఎఫ్, డీఎంఎఫ్‌టీ నిధులతో మౌలిక వసతులను ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. కొన్ని పనులు పూర్తి చేయగా మరికొన్ని నిర్మాణంలో ఉన్నాయన్నారు. బాధ్యతలు స్వీకరించిన సమయం నుంచి ఇప్పటివరకు ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ముందుండేందుకు సహకరించిన పాలకవర్గం, అధికారులు, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పాలకవర్గంతో పాటు మునిసిపల్ చైర్మన్‌ను శాలువా, మెమెంటోలతో సన్మానించారు. కార్యక్రమంలో కమిషనర్ మందా రవిబాబు పాల్గొన్నారు.

## చెరకు రైతుల అభివృద్ధిపై సమీక్ష

కల్లూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) కల్లూరులోని శ్రీ కాకతీయ షుగర్స్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో శుక్రవారం చెరుకు రైతు అభివృద్ధి మండలి సమావేశం చైర్మన్ కస్తాల నేరేంద్ర అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ప్రధానంగా కాకతీయ షుగర్స్ జోన్ పరిధిలో చెరుకు సాగు చేసిన రైతులకు 25 శాతం సబ్సిడీపై కలుపు మందు సరఫరాపై, ఇంకాను ఈ ఏడాది గాను చెరుకు సాగులో ఐదు ప్రాంతాల్లో చెరుకు తోటలను క్షేత్ర పదర్శనలకు ఎంపిక చేసి పది మంది రైతులకు సగటున రూ.10 వేలు పోత్సాహకంగా అందించాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో తీర్మానించారు. చెరుకు సాగు చేసిన తోటలకు అనువైన విధంగా ఉండాలని 22 ఆయుకట్టు రహదారులకు సగటున రూ.లక్ష అంచనాతో మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించటం జరిగింది. ఈ సమావేశంలో ఫ్యాక్టరీ వైస్‌ప్రసిడెంట్ సిహెచ్ నాగేశ్వరరావు, అసిస్టెంట్ కెన్‌అడ్వైజర్ రవీంద్రబాబు, కేన్ అడ్వైజర్ నరిసింహామూర్తి, సిడిసి సభ్యులు శ్రీనివాసరావు, ఇంద్రాసేనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ధ్వజస్తంభం ఊరేగింపు

సత్తుపల్లిరూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యగారిపేటలో నూతనంగా నిర్మితమవుతున్న సీతారాముల ఆలయ ధ్వజస్తంభం ఊరేగింపు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రింగ్‌సెంటర్ వద్దకు చేరుకున్న ధ్వజస్తంభం వద్దకు భారీగా చేరుకున్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఎలక్ట్రికల్ బస్సులను రద్దు చేయాలంటూ నిరసన

సత్తుపల్లిరూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ బస్సులను రద్దు చేయాలంటూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున ఎస్‌డబ్ల్యూఎఫ్-ఐఎన్‌టీయూసీ సంయుక్త ఆధ్వర్యంలో సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో నిరసన కార్యక్రమం చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విద్యుత్ బస్‌ల పథకాలలో సవరణలు చేయాలని, ఆర్టీసీలే నేరుగా విద్యుత్ బస్‌లను కొని నడిపేలా నిధులు సమకూర్చాలని, కార్పొరేట్ సంస్థలకు ఇస్తున్న సబ్సిడీ, ఇన్సెంటీవ్‌లు ఆర్టీసీకి ఇవ్వాలని, ప్రజల అవసరాల మేరకు బస్‌లు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వీకే.రెడ్డి, వి.ప్రభాకరరావు, గడ్డం శ్రీనివాసరావు, ఎన్ఆర్.కృష్ణ, జీ.సతీష్‌కుమార్, జేవీజే.రెడ్డి, ఎన్‌బీ.ప్రసాద్, ఓ.కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## నృత్యాలను కాపాడుకోవడం బాధ్యత



మధిర, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ నృత్యాలైన భరతనాట్యం, కూచిపూడి, జానపద నృత్యాలతో పాటు వెస్టర్న్ నృత్యాలను కాపాడుకోవడం మనఅందరి బాధ్యతని ఎంఈవో వై ప్రభాకర్, భరత్ విద్యాసంస్థల డైరెక్టర్ శీలం వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం మధిరలో నూతనంగా ప్రముఖ నృత్య కళాకారుడు, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డు గ్రహీత కళ్యాణపు నాగరాజు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన డాన్స్ స్కూల్‌ను వారు ప్రారంభించి ప్రసంగించారు. కళాకారులకు పుట్టినిల్లైన మధిరలో సంప్రదాయ నృత్యాలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడం శుభపరిణామమని, దీన్ని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకొని కళలలోనూ మంచిప్రతిభ కనబర్చి రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్పర్సన్ శీలం విద్యాలత, రంగస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షులు పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## మెడిసిన్ విద్యార్థికి చేయూత

కల్లూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధలోని కప్పలబంధం గ్రామంలో మెడిసన్ విద్యార్థికి స్ఫూర్తి ఫౌండేషన్ తరుపున శుక్రవారం రూ.లక్ష ఆర్థిక సహయం అందించారు. కప్పలబంధం గ్రామానికి చెందిన గూడూరు వెంకట నారాయణరెడ్డి కుమార్తె మాధవి మెడిసన్ సీటు సాధించింది. తండ్రి చిన్నతనంలో మృతి చెందగా తన తల్లి శివపార్వతి కుమార్తె మాధవిని కష్టపడి చదివించగా ఈ ఏడాది మెడిసన్ సీటు సాధించింది. దీంతో వైద్య విద్యకు నాలుగు సంత్సారాల పాటుగా అయ్యే కళాశాల ఫీజు మొదటి విడతగా గాను రూ.లక్ష నగదు చెక్కును స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి వర్క రామారావు సదరు విద్యార్థికి అందించారు. స్థానికుడైన బీరవల్లి మాధవ్ అందించిన సమాచారంతో స్ఫూర్తి ఫౌండేష్ వారు నగదును వితరణ చేశారు. దాతలకు సదరు విద్యార్థి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## జూనియర్ కళాశాల విద్యార్థులకు రాగి జావ పంపిణీ



రాగి జావ పంపిణీ చేస్తున్న దృశ్యం

మధిర, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు రాగి జావ పంపిణీ కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఒత్తిడి, బలహీనత, రక్తహీనత కలిగి వుండకూడదనే ఉద్దేశ్యంతో కలెక్టర్ ఆదేశాలపై రాగి జావను పంపిణీ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ జైదాసు తెలిపారు. పరీక్షలు పూర్తయ్యేంతవరకు రాగి జావ పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో తౌరియా, అధ్యాపకులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు సండ్ర పరామర్శ



వీరయ్యకు నివాళి అర్పిస్తున్న సండ్ర

తల్లాడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం బాలపేట గ్రామంలో శుక్రవారం సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఇటీవల బాలపేటలో అనారోగ్యంతో మృతిచెందిన కోసూరి వీరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గొడ్ల మోషయ్య చిత్రపటానికి కూడా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకట్‌లాల్, వజ్రాల రామిరెడ్డి, బద్దం కోటిరెడ్డి, జీవీఆర్, కోడూరి వీరకృష్ణ, దగ్గుల శ్రీనివాసరెడ్డి, నంద్యాల పుల్లయ్య, చిట్టెం నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## మిడ్డే మీల్స్ కార్మికుల ధర్నా

తల్లాడ, జనవరి 24 :మధ్యాహ్నభోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మండల వనరుల కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈవో ఎన్.దామోదర్‌ప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమానుద్దేశించి ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు నిమ్మటూరి రామకృష్ణ మాట్లాడుతూ గత 22ఏళ్లుగా మధ్యాహ్నభోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులపై పెనుభారంగా కోడిగ్రుడ్ల రేటు పెరిగిందన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు, గౌరవ వేతనాన్ని మధ్యాహ్నభోజన కార్మికులకు ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకురాళ్లు తాళ్లూరి లక్ష్మీ, వెంకటమ్మ, సాయమ్మ, మరియమ్మ, భాగ్యవతి, రావేలు, తిరుమలమ్మ పాల్గొన్నారు.